PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 277 | విజయవాడ, ఆదివారం 12 మే 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 12 May 2024 | Rs

పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ

- రైతుల సమస్యలే ఎన్నికల ఎజెండా
- అగ్నివీర్, నిరుద్యోగం, డ్రగ్స్ కూడా..
- కార్నర్ అవుతున్న బిజెపి

4



నిషాకు పారిస్ ఒలింపిక్ బెర్త్

- ఐదో మహిళా రెజ్లర్ అర్హత

8



షర్మిలతో కలిసి అభివాదం చేస్తున్న రాహుల్ గాంధీ

ఎపికి పదేళ్లు ప్రత్యేక హోదా

వైఎస్ షర్మిలను గెలిపించండి • కడప సభలో రాహుల్ గాంధీ

ప్రజాశక్తి– కడప ప్రతినిధి

ఎన్నికల్లో ఇండియా వేదికను గెలిపిస్తే రాష్ట్రానికి పదేళ్ల పాటు ప్రత్యేకహోదా ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించారు. కడపలోని పుత్తా ఎస్టేట్‌లో శనివారం జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విభజన సమయంలో రాష్ట్రానికి బిజెపి ఎన్నో హామీలు ఇచ్చిందని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. 'రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చారా? పోలవరం ప్రాజెక్టుకు నిధులిచ్చారా? కడప స్టీల్ ప్లాంట్‌ను కట్టారా? ' అని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా వేదిక తరఫున కాంగ్రెస్ పార్టీ నుంచి కడప ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిలను గెలిపించాలని పిలుపునిచ్చారు. 2014లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే అన్ని హామీలూ నెరవేరేవన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇండియా వేదికను గెలిపిస్తే పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు నిధులిస్తామని, కడప జిల్లాలో ఉక్కు ప్రాజెక్టును నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇవిగాక, ప్రతి కుటుంబం నుంచి పేద మహిళను గుర్తించి ఏటా ఆమె ఖాతాలో నెలకు రూ.8,500 చొప్పున ఏడాదిలో రూ.లక్ష జమ చేస్తామన్నారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తామని, రూ.రెండు లక్షల మేర రైతు రుణాలు మాఫీ చేస్తామని, ఏటా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉపాధి హామీ కూలిని రూ.400కు పెంచుతామని, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందిస్తామని హామీ ఇచ్చారు. బిజెపి, ప్రధాని మోడీలతో రాజ్యాంగానికి ప్రమాదం పొంచిఉందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోందని చెప్పారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ అని వివరించారు. అవినీతిలో కూరుకుపోయిన జగన్, చంద్రబాబులకు మిగతా 2లో

పివిటిజిలకు బిజెపి ద్రోహం

- 'అంత్యోదయ బియ్యం ఆపేశారు • గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోడీ సర్కారు
- అరకు పార్లమెంట్ స్థానంలో బిజెపి, వైసిపిలను ఓడించండి
- ఎల్లెడలా అప్పలనర్సకు ఆదరణ : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి– పాడేరు

ఏజెన్సీలోని పివిటిజి (ఆదిమ బలహీన) గిరిజనులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాడేరులో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద స్కీములు పెట్టి వారిని ఉద్ధరిస్తున్నామని మోడీ సర్కారు ప్రచారార్భాటాలు చేస్తోందని విమర్శించారు. పివిటిజిల అభివృద్ధికి ఏం చేశారో, ఎన్ని నిధులు వెచ్చించారో వెల్లడించాలని సవాలు విసిరారు. చివరకు అంత్యోదయ బియ్యం కూడా ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో పోటీచేస్తున్న సిపిఎం అరకు లోక్‌సభ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఇప్పటికే ఆయనకు ఆదివాసీల్లో ప్రజాదరణ పెరిగిందని, గెలిపిస్తే ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చి కృషి చేస్తారని శ్రీనివాసరావు చెప్పారు. అరకు లోక్‌సభ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొత్తపల్లి గీత, ప్రస్తుతం ప్రజాదరణ కోల్పోయి ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. వైసిపి అభ్యర్థి తనూజరాణి నియోజకవర్గానికిగానీ, సొంత గ్రామానికిగానీ చేసిన సేవలు ఏమీ లేవన్నారు. వారిద్దరి పట్ల ప్రజలు విముఖతతో ఉన్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆది నుంచీ ప్రజా పోరాటాలతో గిరిజనుల చట్టాలు, హక్కుల అమలుకు కృషి చేస్తోన్న అప్పలనర్స పట్ల ప్రజల్లో సదభిప్రాయం ఏర్పడిందన్నారు. జిఒ నెంబర్ 3 రద్దులో బిజెపి హస్తం ఉందని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి ఐదో షెడ్యూల్ లేకుండా చేసి ఈ ప్రాంతంలోని సహజ సంపదలను అదానీ, అంబానీవంటి వారి పరం చేసేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని వివరించారు. గిరిజన హక్కులు, చట్టాలు అమలు కాకుంటే మన్య ప్రాంతం ప్రత్యేకతలను కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

భాషా వలంటీర్లను పాలకులు వంచించారన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ బిజెపి ప్రభుత్వం సవరణలు తెచ్చిందని, అటవీ భూములను లాక్కునే ందుకు కుట్రలు చేస్తోందని తెలిపారు. ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి మోడీ సర్కారు కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పుడిస్తున్న ఉపాధి కూలి పెరిగిన నిత్యావసర ధరల నేపథ్యంలో గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. ఇండియా వేదిక అధికారంలోకి వస్తే రోజుకు రూ.400 ఉపాధి వేతనం వచ్చేలా చూస్తుందన్నారు. నిరుద్యోగుల కోసం స్పెషల్ డిఎస్‌సి నిర్వహిస్తుందని తెలిపారు. ఆదివాసీల ప్రయోజనాలను కాపాడలేకపోతున్న పాలకపక్షాలను ఓడించేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారన్నారు. అరకు పార్లమెంట్‌లో బిజెపి, వైసిపిలను ఓడించి సిపిఎంను గెలిపించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, నాయకులు జి.కోటేశ్వరరావు, బోనంగి చిన్నయ్య పడాల్, సుందరరావు పాల్గొన్నారు.

మోదకొండమ్మను మోడీ కొండగా మారుస్తారు!

అభివృద్ధి, సంక్షేమాన్ని వదిలేసిన మోడీ ఈ ఎన్నికల్లో దేవుడి పేరుతో, మతం పేరుతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. బిజెపి ఒకే దేశం – ఒకే దేవుడంటూ స్థానిక దేవతలకు, అమ్మవార్లకు ప్రాధాన్యత లేకుండా దురాక్రమణ చేస్తోందన్నారు. నమో అంటే నరేంద్ర మోడీ కాదని.. నమ్మించి మోసం చేసేవారని ఎద్దేవా చేశారు. పాడేరు ప్రాంతంలో ప్రజలు మోదకొండమ్మను ఎంతో పవిత్రమైన దేవతగా పూజిస్తారని, బిజెపి అధికారంలోకొస్తే మోదకొండమ్మ కాస్త మోడీ కొండగా మారిపోతుందని అన్నారు. దేవుళ్లను సైతం దురాక్రమణ చేసిన ఘనత మోడీదేనని విమర్శించారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- అరకు వ్యాలీ, పాడేరు, రంపచోడవరంలో సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్
- పాలకొండ, కురుపాం, సాలూరుల్లో సాయంత్రం 5గంటల వరకే పోలింగ్
- ఏజెంట్లుగా నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు ఎవరైనా ఉండొచ్చు
- సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయని సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 శాసనసభ, 25 పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరగనుండగా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు మినహా మిగిలిన 169 నియోజక వర్గాల్లో పోలింగ్ ఉదయం 7గంటలకు ప్రారంభమై సాయంత్రం 6గంటల వరకు జరుగనుంది. పాలకొండ (ఎస్‌టి), కురుపాం (ఎస్‌టి), సాలూరు (ఎస్‌టి) నియోజకవర్గాల్లో పోలింగ్ ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు, అరుకు వ్యాలీ(ఎస్‌టి) పాడేరు (ఎస్‌టి)రంపచోడవరం (ఎస్‌టి) నియోజకవర్గాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుం దని సిఇఓ తెలిపారు. సచివాలయంలో శనివారం ఆయన మీడియాతో ఎన్నికల ఏర్పాట్లు, బందోబస్తు, పోలింగ్ ప్రక్రియ లాంటి పలు అంశాలపై ఆయన మాట్లాడారు. మొబైల్ ఫోన్లు పోలింగ్ బూత్‌ల వద్దకు ఎవరూ తీసుకురాకూడదన్నారు. నాలుగైదు జిల్లాల్లో పోలింగ్ బూత్ స్లిప్స్‌తోపాటు ఇతర మెటీరియల్‌ను ఎన్నికల కమిషన్ సీజ్ చేసింది. పల్నాడు, ఒంగోలులో ఇటువంటి వాటిని సీజ్ చేయడంతో పాటు ఇందుకు బాధ్యులైన వారికి ఎన్నికల కమిషన్ నోటీసులిచ్చింది.

12,438 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు: రాష్ట్ర వ్యాప్తంగా 46,389 పోలింగ్ మిగతా 2లో

పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వం

- ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం
- భద్రతా మండలికి మరోమారు ప్రతిపాదన

పాలస్తీనాను పూర్తి స్థాయి సభ్యత్వ దేశంగా గుర్తించే చారిత్రాత్మక తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ గురువారం రాత్రి ఆమోదించింది. సభ్య దేశంగా తీసుకునేందుకు అవసరమైన అర్హత పాలస్తీనాకు వుందని, కాబట్టి పూర్తి స్థాయి సభ్యత్వం ఇచ్చే విషయాన్ని పున: పరిశీలించాల్సిందిగా భద్రతా మండలికి జనరల్ అసెంబ్లీ సిఫార్సు చేసింది. ఇంతకుముందు అమెరికా భద్రతా మండలిలో ఇటువంటి తీర్మానాన్ని వీటో చేసింది. ఇప్పుడు జనరల్ అసెంబ్లీలో కూడా ఈ తీర్మానాన్ని వ్యతిరేకించిన తొమ్మిది దేశాల్లో అమెరికా ఒకటి. జనరల్ అసెంబ్లీలో తీర్మానం ఆమోదానికి మూడింట రెండొంతుల మెజార్టీ అవసరం కాగా, దీనికి అంతకుమించిన ఓట్లు లభించాయి. అరబ్ గ్రూపు దేశాలు ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అనుకూలంగా 143 దేశాలు ఓటు చేయగా, వ్యతిరేకంగా 9 దేశాలు మిగతా 7లో

వచ్చేది 'ఇండియా' ప్రభుత్వమే!

- మోడీ నియంతృత్వాన్ని ప్రజలు కచ్చితంగా ఓడిస్తారు
- ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా సాధిస్తాం
- ఎన్నికల ర్యాలీలో కేజ్రీవాల్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాబోయేది ఇండియా బ్లాక్ ప్రభుత్వమేనని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. శుక్రవారం తీహార్ జైలు నుండి విడుదలైన కేజ్రీవాల్ శనివారం పంజాబ్ సిఎం భగవంత్ మాన్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా దక్షిణ ఢిల్లీ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొన్నారు. "ఇదొక చారిత్రక క్షణం. చరిత్ర మలుపు తీసుకుంటోంది. ఇండియా బ్లాక్ అధికారంలోకి వచ్చాక దేశంలో కొత్తశకం మొదలవుతుందని" అన్నారు. 'నియంతృత్వానికి వ్యతిరేకంగానే మా పోరాటం. ఇందుకోసం మీ మద్దతు కావాలి. ఏ నియంతనూ, ఏనాడూ ఈ దేశం ఆమోదించలేదు. ప్రజలే వారిని తొలగించారు' అని ఆయన అన్నారు. జూన్ 4న కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఊడడం ఖాయమన్నారు. కర్ణాటక, హర్యానా ప్రతిచోటా వారు



ఢిల్లీ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేజ్రీవాల్, భగవంత్ మాన్ సింగ్

సీట్లను కోల్పోనున్నారని తెలిపారు. పంజాబ్‌లో, ఢిల్లీలో వారికి ఒక్క సీటు కూడా రాదన్నారు. ఢిల్లీలోని ఏడు సీట్లు ఇండియా బ్లాక్ గెలుస్తుందని చెప్పారు. ఇండియా బ్లాక్ అధికారం చేపడితే, ఢిల్లీకి పూర్తి స్థాయి రాష్ట్ర హోదా వస్తుందని చెప్పారు. అంతకుముందు ఆయన పత్రికా గోష్ఠిలో మాట్లాడుతూ, ఇండియా బ్లాక్ తరపున ప్రధాని అభ్యర్థి ఎవరని ప్రశ్నించే ఎన్డీయే నాయకులకు ఆయన సూటిగా ఒక ప్రశ్న వేశారు. 2025 సెప్టెంబర్ 17తో ప్రధాని మోడీ మిగతా 7లో



ఓటెయ్యడానికి సొంతూళ్లకు...

ఈ నెల 13న జరిగే ఓట్ల 'పండగ'కు ఓటర్లు తెలంగాణ నుండి ఆంధ్రాలోని తమ స్వస్థలాలకు పయనమయ్యారు. దీంతో, జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరిగింది. టోల్‌గేట్ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద చీమలదండులా ఒకదాని వెంట మరొకటి నిలిచిన వాహనాలివి.

-ఫొటో : ఎల్.నాగమల్లేశ్వరరావు, కంచికచర్ల

ఇసి తీరు విస్మయకరం

- మల్లికార్జున ఖర్గే



న్యూఢిల్లీ : భారత ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ఇండియా బ్లాక్ నేతలకు తాను రాసిన లేఖపై ఆఘమేఘాలపై ఇసి స్పందించిందని, అయితే మత విద్వేష ప్రసంగాలు, ఎన్నికల అక్రమాలపై ఎన్నికల కమిషన్‌కే తాను నేరుగా చేసిన ఫిర్యాదులపై మాత్రం ఇసి స్పందించలేకపోయిందని, ఇది విస్మయకరమని ఆయన అన్నారు. మతోన్మాదాన్ని, కులతత్వాన్ని రెచ్చగొట్టేలా బిజెపికి చెందిన పలువురు నేతలు చేస్తున్న దారుణమైన ప్రకటనలపై దృష్టిసారించడంలో ఇసి తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ మేరకు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు, ఇతర ఎన్నికల కమిషనర్లకు శనివారం ఆయన లేఖ రాశారు. నేరుగా ఎన్నికల కమిషన్‌కే అనేక ఫిర్యాదులను చేసినా వాటిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ 'ఇండియా' నేతలకు రాసిన లేఖపై మాత్రం ఇసి స్పందించడం వింతగా అనిపించిందని ఆయన తాజా లేఖలో పేర్కొన్నారు. ఆ లేఖలో భాషకు సంబంధించి కొన్ని సందేహాలు వుండవచ్చు, కానీ దానిపై నేను పట్టుబట్టాలనుకోవడం లేదు. ఎందుకంటే వారెలాంటి ఒత్తిళ్ల కింద పనిచేస్తున్నారో నాకు అర్ధమవుతోందని ఖర్గే ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రశ్నలు అడిగేందుకు పౌరులకు గల హక్కును కమిషన్ గౌరవిస్తుందని అంటూనే జాగ్రత్తగా ఉండాలంటూ సలహా రూపంలో పౌరులను ఇసి బెదిరిస్తోందని..తనకు ఇసి రాసిన లేఖలో పేర్కొన్న వివరాలను ఖర్గే వెల్లడించారు. వాస్తవమే అయినప్పటికీ, ఒక నియోజకవర్గం లేదా రాష్ట్రం స్థాయిలో మొత్తంగా ఓటర్ల పోలింగ్ డేటాను ప్రచురించాలన్న చట్టబద్ధమైన బాధ్యత కమిషన్‌కు లేదని ఎన్నికల సంఘమే చెప్పడం తనను విస్తుపోయేలా చేసిందని ఖర్గే తెలిపారు.



కుక్కల దాడిలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి– జియ్యమ్మవలస

పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలంలో కుక్కల దాడిలో వృద్ధురాలు మృతి చెందారు. శనివారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మి (70) బహిర్భూమికి వెళ్తున్న సమయంలో ఎనిమిది కుక్కలు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. దీంతో, ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే లక్ష్మి తల పైభాగాన్ని, రెండు కాళ్లను కుక్కలు కొరికేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. లక్ష్మికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, ఇదే గ్రామంలో పది రోజుల క్రితం గొడబ సరోజిని, అలజంగి పార్వతి, ఎం.లక్ష్మిలను కుక్కలు కరవడంతో తీవ్రంగా గాయపడ్డారు. కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోయారు.

షర్మిలను ఆశీర్వదించండి

- వైఎస్ విజయమ్మ విజ్ఞప్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ పులివెందుల టౌన్



కడప పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలిచిన వైఎస్ షర్మిలను ఆశీర్వదించాలని వైఎస్ఆర్ సతీమణి వైఎస్.విజయమ్మ విజ్ఞప్తి చేశారు. వాట్సాప్ వీడియో సందేశంలో ఆమె ఈ మేరకు కోరారు. వైఎస్ఆర్‌ను కడప పార్లమెంట్ ప్రజలు ఎలా అక్కున చేర్చుకుని, ఆదరించారో అలాగే ఆయన కుమార్తె వైఎస్ షర్మిలను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ మీసేవ చేస్తుండగానే చనిపోయారని, ఆయనలాగే సేవ చేసే అవకాశం ఆయన ముద్దులబిడ్డ వైఎస్ షర్మిలకు కల్పించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో విజయమ్మ కుమారుడు, కుమార్తె వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్.షర్మిల ఇద్దరూ వేర్వేరు పార్టీల్లో ఉన్నారు. వారివురూ ఎన్నికల బరిలో ఉండడంతో ఎవరికి ప్రచారం చేయలేని పరిస్థితుల్లో విజయమ్మ అమెరికాకు వెళ్లిన విషయం తెలిసిందే. ప్రచారాలలో వైఎస్ఆర్‌కు నిజమైన వారసురాలు తానేనని షర్మిల చెప్పుకుంటున్న నేపథ్యంలో విజయమ్మ వీడియో విడుదల చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

వైసిపి ప్రభుత్వంపై వేటు వేయండి

రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాన్ని కాటు వేసిన వైసిపి ప్రభుత్వంపై ఓటుతో వేటు వేయాలని రాష్ట్ర ప్రజలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు ఆయన శనివారం బహిరంగ లేఖ విడుదల చేశారు. 13వ తేదీన జరుగుతున్న ఎన్నికలు రాష్ట్రాభివృద్ధికి, భవిష్యత్ తరాల అభ్యున్నతికి అత్యంత కీలకమని లేఖలో ఆయన పేర్కొన్నారు. ఆ రోజున వేసే ఓటుతో కబ్జాలకు, బాదుడుకు, అరాచకాలకు ముగింపు పలకాల న్నారు. ఒకవైపు విభజన కష్టాలు, మరోవైపు ఆర్థిక లోటుతో 2014లో టిడిపి ప్రభుత్వం ప్రయాణం మొదలు పెట్టిందని పేర్కొన్నారు. సుపరిపాలనతో అనతికాలంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించామని పేర్కొన్నారు. ప్రతి వర్గానికి ప్రయోజనం కల్పించేలా వందకు పైగా సంక్షేమ పథకాలు అమలు చేశామని తెలిపారు. 2019లో తిరిగి అధికారంలోకి వచ్చి ఉంటే అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉండేవాళ్లమని పేర్కొన్నారు. అలాంటి కీలక సమయంలో మోసపూరిత హామీలు, తప్పుడు ప్రచారాలు, డ్రామాలతో ప్రజలను మోసం చేసి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. వైసిపి భస్మాసురుల నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాలని కోరారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి: ఆర్‌టిసి ఎమ్‌డికి లేఖ

ఎన్నికల నేపథ్యంలో అదనపు బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి ఎమ్‌డిని చంద్రబాబునాయుడు మరో లేఖ ద్వారా కోరారు. తెలంగాణలో ఉన్న రాష్ట్ర ఓటర్లు వారి సొంత ప్రాంతాలకు ఓటు వేసేందుకు వస్తారని తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు ప్రయాణమవుతున్నారని వివరించారు. ఇలాంటి సమయంలో ఆర్‌టిసి సౌకర్యం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.. రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం వల్ల ఓటింగ్ శాతం పెరగడానికి అవకాశం ఉంటుందని వివరించారు.

ఒరిజినల్ దస్తావేజులు ఇస్తాం

- జిరాక్స్ కాపీలపై చంద్రబాబు దుష్ప్రచారం
- పవన్‌ను నమ్మేస్థితిలో మహిళలు లేరు
- చిలకలూరిపేట, కైకలూరు, పిఠాపురం సభల్లో సిఎం జగన్



పిఠాపురం సభలో మాట్లాడుతున్న సిఎం జగన్, పక్కన వంగా గీత, చలమలశెట్టి సునీల్

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో భూముల కొనుగోలు చేసిన వారికి జిరాక్స్ కాపీలు ఇస్తారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని సిఎం జగన్ ధ్వజమెత్తారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ప్రజలను చంద్రబాబు తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇటీవల పవన్ కల్యాణ్, బాలకృష్ణ అల్లుడు భూములు కొన్నారని వారికి ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇవ్వలేదా? రాష్ట్రంలో ఎక్కడైనా ఇప్పటివరకు జిరాక్స్ కాపీలు ఇచ్చిన దాఖలాలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. చంద్రబాబు మోసాలను నమ్మొద్దని, 2014 మేనిఫెస్టోలో ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, మళ్లీ ఇప్పుడు అదే కూటమి మాయమాటలతో ముందుకొచ్చిందని, ఆలోచించి ఓటువేయాలని కోరారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట, ఏలూరు జిల్లా కైకలూరు, కాకినాడ జిల్లా పిఠాపురంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న తొమ్మిది లక్షల మందికి ఒరిజినల్ డీడ్స్ ఇచ్చామని వివరించారు. ప్రతిపక్షంలో ఉండగా పేదల గురించి మాట్లాడతారని, అధికారంలోకి రాగానే కార్పొరేట్ల వైపు చంద్రబాబు చూస్తారని విమర్శించారు. 2014లో చంద్రబాబు స్వయంగా సంతకం పెట్టి ఇచ్చిన మేనిఫెస్టోలో ఒక్క హామీని కూడా అమలు చేయలేదని గుర్తు చేశారు. ఇంటింటికీ వలంటీర్ల ద్వారా పింఛను ఇచ్చే కార్యక్రమాన్ని కోర్టుల ద్వారా చంద్రబాబు నిలిపివేయించడం బాధేస్తోందన్నారు. ఢిల్లీలో ఎన్నికల కమిషన్‌ను మేనేజ్ చేసి సంక్షేమ పథకాల సొమ్ములను కూటమి నేతలు అడ్డుకున్నారని ఆరోపించారు. ఎక్కడా వివక్ష లేకుండా వివిధ పథకాల కింద నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇప్పటి వరకూ సొమ్ము జమ చేశామన్నారు. 2.31 లక్షల ఉద్యోగాలు, నాడు-నేడు, విద్యా కానుక, గోరుముద్ద, అమ్మఒడి, జగనన్న తోడు, చేదోడు, లా నేస్తం, 31 లక్షల ఇళ్లపట్టాల పంపిణీ వంటివి ఎప్పుడైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. కొల్లేరు సర్వే పూర్తయిందని, నివేదిక వచ్చిన తర్వాత అదనపు భూములు పంచుతామని హామీ ఇచ్చారు. పిఠాపురంలో పోటీ చేస్తున్న దత్తపుత్రుడికి 2014లో టిడిపి, బిజెపి, జనసేన ఇచ్చిన హామీలు గుర్తున్నాయా? అని ప్రశ్నించారు. మహిళలు పవన్‌ను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. పిఠాపురం వైసిపి అభ్యర్థి వంగా గీతను భారీ మెజారిటీతో గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆమెను డిప్యూటీ సిఎంను చేస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యర్థులు తనను అవమానిస్తున్నారని, అవహేళన చేస్తున్నరని వంగా గీత కన్నీళ్లు పెట్టుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఆయా సభల్లో ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్లు ఉండగా అందులో 12,438 సమస్యాత్మకమైనవిగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఇందులో మావోయిస్టు ప్రభావిత పోలింగ్ స్టేషన్లు 698 ఉన్నాయి, మొత్తం పోలింగ్ స్టేషన్లలో 34,651 (74.70శాతం) స్టేషన్లలో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. గతంలో పోలింగ్ స్టేషన్లలో లోపల వెబ్ కెమెరాలు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం పోలింగ్ స్టేషన్ బయట కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు 1,06,145 మంది పోలీసులను వినియోగించనున్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తుకు సిఆర్‌పిఎఫ్‌ను వినియోగించనున్నారు.

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో మూడు క్యూ లైన్లు

ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఎన్నికల కమిషన్ మూడు క్యూలైన్లను ఏర్పాటు చేస్తోంది. ఒక లైను పురుషులకు, రెండో లైను మహిళలకు, మూడో లైన్ సీనియర్ సిటిజన్లు, వికలాంగుల కోసం కేటాయించనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటు ఉన్న వారిని మాత్రమే పోలింగ్‌బూత్‌ల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లుగా నియమించాలి.

మూడు రోజులు పరీక్షలు నిర్వహించొద్దు

విద్యార్థులు తమ ఓటు హక్కును వారి స్వగ్రామాల్లో వినియోగించుకునేందుకు వీలుగా పోలింగ్‌కు ఒక రోజు ముందు, పోలింగ్ జరిగే రోజు, తిరిగి వారి గ్రామాల నుంచి కళాశాలకు తిరిగి వచ్చేందుకు వీలుగా ఆ మూడు రోజులు విద్యాలయాల్లో ఎటువంటి పరీక్షలు నిర్వహించొద్దని విద్యాసంస్థలకు ఎన్నికల కమిషన్ సూచించింది. ఎన్నికలు జరిగే రోజు ఎస్ఆర్ఎమ్ యూనివర్శిటీలో పరీక్షలు ఉన్నాయని, తాము ఓటు హక్కు వినియోగించుకునేది ఎలా అంటూ విద్యార్థులు ఇసిని సంప్రదించిన నేపథ్యంలో ఈ మేరకు విద్యాలయాలకు సూచించినట్లు సిఇఓ తెలిపారు.

ప్రాణం తీసిన ఎన్నికల ఒత్తిడి

- గుండెపోటుతో వికలాంగ ఉపాధ్యాయుడి మృతి

ప్రజాశక్తి - పెరవలి (తూర్పుగోదావరి)

ఎన్నికల విధుల్లో ఒత్తిడికి గురైన ఓ ఉపాధ్యాయుడు గుండెపోటుకు గురై మృతి చెందారు. ఈ ఘటన తూర్పు గోదావరి జిల్లా పెరవలి గ్రామంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పెరవలి మండలం పెరవలి గ్రామంలోని ఎంపిపి పాఠశాల-1లో కొలనువాడ సుబ్బరాజు (59) సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు 80 శాతం అంగవైకల్యం ఉండడంతో ప్రతిరోజూ మరొకరి సాయంతో విధులకు హాజరయ్యేవారు. ఏడాది క్రితం ఆయన గుండెపోటుకు గురయ్యారు. చికిత్స అనంతరం తిరిగి విధులకు హాజరయ్యారు. ఇటీవల ఆయనకు రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరంలో ఎన్నికల డ్యూటీ వేశారు. తనకు ఎలక్షన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులను కోరారు. అధికారులు కనికరించకపోవడంతో మానసికంగా కుంగిపోయారు. ఈ క్రమంలో శనివారం గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని పెరవలి ఎంఇఒ బి.స్వరూప్ పరామర్శించారు.

అత్యధికులు కోటీశ్వరులే!

- వైసిపి, టిడిపి అభ్యర్థుల్లో 94 శాతం, బిజెపి 80 శాతం, జనసేన 86 శాతం
- 23 శాతం మందిపై క్రిమినల్ కేసులు : ఎడిఆర్ రిపోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేస్తున్న అధికారం వైసిపి, ప్రతిపక్ష టిడిపి అభ్యర్థుల్లో 94 శాతం మంది కోటీశ్వరులే ఉన్నారు. 23 శాతం మంది క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) రిపోర్టు విడుదల చేసింది. రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరుగుతుంది. రాష్ట్రంలో మొత్తం 2,368 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, వారిలో 604 మంది (26 శాతం) కోటీశ్వరులు ఉన్నారు. 175 మంది వైసిపి అభ్యర్థుల్లో 165 (94 శాతం) మంది, 143 మంది టిడిపి అభ్యర్థుల్లో 134 (94 శాతం) మంది, 21 మంది జనసేన అభ్యర్థుల్లో 18 (86 శాతం) మంది, 10 మంది బిజెపి అభ్యర్థుల్లో 8 (80 శాతం) మంది, 158 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 79 (50 శాతం) మంది కోటి రూపాయలకు పైబడి ఆస్తులను ప్రకటించారు.

23 శాతం మందిపై క్రిమినల్ కేసులు

543 (23 శాతం) మంది క్రిమినల్ కేసులు ఉన్నవారు పోటీ చేస్తున్నారు. 2019లో 331 (17 శాతం) మంది క్రిమినల్ కేసులు ఉన్నవారు పోటీ చేశారు. 374 (16 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు పోటీ చేస్తున్నారు. 2019లో 220 (11 శాతం) మంది తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నవారు పోటీ చేశారు.

175 మంది వైసిపి అభ్యర్థుల్లో 87 (50 శాతం) మంది, 143 మంది టిడిపి అభ్యర్థుల్లో 119 (83 శాతం) మంది, 10 మంది బిజెపి అభ్యర్థుల్లో 8 (80 శాతం) మంది, 158 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో 42 (27 శాతం) మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 89 మంది అభ్యర్థులు మహిళలపై దాడులకు సంబంధించిన కేసులు ఎదుర్కొంటున్నారు. నలుగురు అభ్యర్థులు అత్యాచార కేసులు ఎదుర్కొంటున్నారు. పదహారు మంది అభ్యర్థులు హత్య కేసులు ఎదుర్కొంటున్నారు.

పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి 14న స్పెషల్ క్యాజువల్ లీవ్ : సిఇఒ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 13న ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆ మరుసటి రోజు (14వ తేదీ) ప్రత్యేక క్యాజువల్ లీవ్ (ఆన్‌డ్యూటీ) సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత లీవ్ శాంక్షనింగ్ అథారిటీలు అవసరమైన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఎపి ఎన్‌జిఓ, ఎపి జెఎసి ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సిఇఓ తెలిపారు. పోలింగ్ విధులు నిర్వహించే ప్రిసైడింగ్ అధికారులు (పిఓ) అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఎపిఓ) ఇతర పోలింగ్ సిబ్బంది (ఒపిఓ)కి 14న ప్రత్యేక క్యాజువల్ లీవ్ వర్తిస్తుందని తెలిపారు. పోలింగ్ విధులకు హాజరై రిజర్వుడు సిబ్బందిగా ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందిగా డ్రాఫ్టు చేయబడిన వారికి ఈ ప్రత్యేక క్యాజువల్ లీవ్ వర్తించదని సిఇఓ ముఖేష్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. వాస్తవంగా ఎవరైతే పోలింగ్ విధులు నిర్వహిస్తారో వారికి మాత్రమే ఈ లీవ్ వర్తిస్తుందన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు ఈ ఆదేశాలను రిటర్నింగ్ అధికారులకు తెలియజేయాలని, 13న పోలింగ్ అనంతరం నిర్దేశిత కేంద్రంలో పోలింగ్ సామాగ్రిని అందజేసిన అనంతరం పిఓ, ఎపిఓ, ఒపిఓలకు డ్యూటీ సర్టిఫికెట్లను జారీ చేసి, 14న ఈ ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సిఇఓ ఆదేశించారు. అందరూ కార్యదర్శులు, శాఖాధిపతులు, జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న కలెక్టర్లు సంబంధిత లీవ్ శాంక్షనింగ్ అథారిటీలకు తమ ఆదేశాలను సర్క్యులేట్ చేసి, పోలింగ్ విధులు నిర్వహించిన వారికి ప్రత్యేక క్యాజువల్ లీవ్ పరిగణించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

పోలింగ్‌కు ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ నుంచి 339, బెంగళూరు నుంచి 323 సర్వీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. ఈ నెల 13న ఎన్నికలు జరుగుతుండటంతో హైదరాబాద్‌నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నడిచే 339 సర్వీసులతోపాటు ఈ నెల 11వ తేదీన 302, 12వ తేదీన 206 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి ఒంగోలుకు 38, ఏలూరుకు 20, మచిలీపట్నంకు 23, విజయవాడకు 45, గుంటూరుకు 18, నరసరావుపేటకు 26, నెల్లూరుకు 17, నంద్యాలకు 19, విశాఖకు నాలుగు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. బెంగళూరు నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 11వ తేదీన 323 సర్వీసులు, 12వ తేదీన 269 బస్సులను నడుపుతున్నామని, రెగ్యులర్‌గా నడిచే బస్సులకు ఇవి అదనం అని ప్రకటించారు. విజయవాడ నుంచి విశాఖ, రాజమండ్రి, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకూ ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. ఈ బస్సు సర్వీసులన్నీ సాధారణ ఛార్జితోనే నడుస్తున్నాయని, ఓటు వేసి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసమూ ప్రత్యేక సర్వీసులు ఉంటాయని ఆయన తెలిపారు.

ఎపికి పదేళ్లు ప్రత్యేక హోదా

(మొదటి పేజీ తరువాయి)

మోడీని ప్రశ్నించే ధైర్యం లేదని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోడీ పాలనకు కాలం చెల్లిందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాక్షించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని సమర్థించిన టిడిపి, వైసిపి తోడుదొంగలని విమర్శించారు. కడప ఎంపి అభ్యర్థి, పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్ షర్మిల మాట్లాడుతూ పదేళ్లుగా రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్న బిజెపికి చంద్రబాబు, వైఎస్ జగన్ తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. సింగపూర్ లాంటి రాజధానిని నిర్మిస్తామంటూ చంద్రబాబు, మూడు రాజధానులంటూ వైఎస్ జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. వివేకా హంతకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెంటబెట్టుకుని తిరుగుతున్నాడని విమర్శించారు. బహిరంగ సభకు ముందు ఇడుపులపాయకు రాహుల్, షర్మిల వెళ్లి వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్, మాణిక్యం ఠాగూర్, కెవిపి రామచంద్రరావు, పిసిసి మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్, మాజీ మంత్రి అహ్మదుల్లా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, సిపిఎం వైఎస్ఆర్ జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కడప, అన్నమయ్య జిల్లాల పార్లమెంట్, అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సభకు తరలివచ్చారు.



శిల్పా రవిచంద్రను గెలిపించండి

- ఆయన నాకు మంచి మిత్రుడు : అల్లు అర్జున్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డికి సినీ హీరో అల్లు అర్జున్ మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో నంద్యాలలో శనివారం అల్లు అర్జున్ సందడి చేశారు. స్థానిక మున్సిపల్ ఆఫీస్ వద్ద ఆయన అభిమానులు, వైసిపి కార్యకర్తలు అల్లు అర్జున్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా రవి నివాసానికి ర్యాలీగా చేరుకుని అక్కడ సేద తీరారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మీడియాతో మాట్లాడుతూ శిల్పా రవి తనకు మంచి మిత్రుడని, తనకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, కేవలం వ్యక్తిగత స్నేహంతోనే తాను నంద్యాలకు వచ్చానని చెప్పారు. అతనితో తన కుటుంబానికి ఉన్న అనుబంధమే తనను ఇక్కడకు వచ్చేలా చేసిందన్నారు. రవి మంచి మెజార్టీతో గెలుపొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిశోర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, ఆదిరెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త వైసిపి ముఖ్య నాయకుడు రత్నబాబు చౌదరి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆక్కడకు భారీగా చేరుకొని హంగామా చేశారు. ముఖ్యంగా శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి ఇంటి ప్రాంగణం జన సంద్రాన్ని తలపించింది.

అల్లు అర్జున్, ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లఘించి, అనుమతి లేకుండా జనసమీకరణ చేసినందుకు ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్‌పై, నంద్యాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా రవిచంద్రపై పై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

పోలీసు స్టేషన్‌లోనే టిడిపి కార్యకర్తపై వైసిపి నేత దాడి

- బాధితుడి బంధువుల ఆందోళన
- ఎస్ఐ సస్పెన్షన్

ప్రజాశక్తి-కర్లపాలెం (బాపట్ల జిల్లా)

'మా పార్టీ నుండి టిడిపిలో చేరతావా' అంటూ బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలో ఓ వ్యక్తిపై వైసిపి నేత, సినీ నిర్మాత కోన వెంకట్ పోలీస్ స్టేషన్‌లోనే దాడి చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. బాధితుడి సోదరుడు కత్తి దయాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గణపవరం పంచాయతీ పరిధిలోని లంకమాలపల్లికి చెందిన కత్తి రాజేష్ ఇటీవల టిడిపిలో చేరారు. ఇది సహించని వైసిపి నేతలు ఆయనపై కక్ష కట్టారు. వైసిపి నేతల ప్రోద్బలంతో ఎస్ఐ జనార్ధన్.. రాజేష్‌ను స్టేషన్‌కు తీసుకొచ్చారు. అక్కడికి చేరుకున్న కోన వెంకట్ 'నిన్నటి వరకు మా పార్టీలో ఉండి.. ఇప్పుడు టిడిపిలో చేరతావా.?' అంటూ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల ముందే రాజేష్‌పై దాడి చేశారు. విషయం తెలుసుకున్న టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నరేంద్రవర్మ, మాజీ ఎమ్మెల్సీ, బిజెపి నాయకులు అన్న సతీష్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చీరల గోవర్ధన్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధితుడికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. రాజేష్‌పై దాడి చేసిన కోన వెంకట్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుడి బంధువులు మాట్లాడుతూ న్యాయం జరిగే వరకు స్టేషన్ నుండి బయటికి వెళ్లబోమని అక్కడే భీష్మించారు. డిఎస్‌పి మురళీకృష్ణ, సిఐ హజరత్ బాబు స్టేషన్‌కు చేరుకొని నాయకులతో మాట్లాడారు. ఎస్ఐ జనార్ధన్ వైసిపి కార్యకర్తగా వ్యవహరిస్తున్నారని, ఏ కారణంతో రాజేష్‌ను స్టేషన్‌కు తీసుకువచ్చారని డిఎస్‌పిని నిలదీశారు. బాధితునికి న్యాయం చేస్తానని డిఎస్‌పి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్ఐని అధికారులు సస్పెన్షన్ చేశారు.

ప్రమాదంలో వ్యాన్‌బోల్తా

బయటపడ్డ రూ.7 కోట్ల నగదు

ప్రజాశక్తి-నల్లజర్ల(తూర్పు గోదావరి)

తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్రకాలువ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యాన్ బోల్తా పడింది. ఈ వ్యాన్‌లో రూ.ఏడు కోట్ల నగదు బయటపడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదులోని నాచారం వద్ద ఉన్న న్యూ కాంటెంటల్ కెమికల్ ఎర్త్ కంపెనీ నుంచి తూర్పుగోదావరి జిల్లా మండపేటలోని మాధవి ఎజిబిల్ బ్రాన్ ఆయిల్ కెమికల్ ఫ్యాక్టరీకి కెమికల్ పొడి లోడుతో వ్యాను బయలు దేరింది. నల్లజర్ల మండలం అనంతపల్లి ఎర్ర కాలువ దాటగానే ఈ వ్యాన్‌ను విజయవాడ నుంచి విశాఖ వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ బోల్తా పడింది. వానులోని కెమికల్ పొడి బస్తాలు చెల్లా చెదురుగా పడిపోయాయి. వాటి మధ్య ఏడు అట్ట పెట్టెలు బయటపడ్డాయి. సిఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని బాక్సులను పరిశీలించగా వాటిలో రూ.500, రూ.200, రూ.100 నోట్ల కట్టలను గుర్తించారు. డిఎస్‌పి రామారావు, ఎంపిడిఒ నరేష్‌కుమార్, తహశీల్దార్, ఐటి అధికారుల సమక్షంలో లెక్కించారు. ఒక్కొక్క బాక్సులో రూ.కోటి చొప్పున రూ.7 కోట్ల నగదు ఉన్నట్టు గుర్తించారు. నగదును ఐటి అధికారులకు అప్పగించి కేసు నమోదు చేశామని డిఎస్‌పి తెలిపారు.


కర్నూలు జిల్లా కల్లూరులో గౌస్‌దేశాయ్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్


విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రోడ్ షోలో పాల్గొన్న బాబూరావు


విశాఖలోని వడ్లపూడి రైల్వే క్వార్టర్స్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

చివరి రోజు సిపిఎం అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారంతో ముగిసింది. చివరి రోజు సిపిఎం అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో ప్రచారాలతో హోరెత్తించారు. ర్యాలీలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఇంటింటికెళ్లి ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించేందుకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. గత నెల 18 నుంచి ఈ నెల 11వ తేదీ వరకు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుసరించిన నిరంకుశ విధానాలను ప్రజల్లో ఎండగట్టారు. సిపిఎం అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను వివరించారు.

కర్నూలు జిల్లా కల్లూరులో పాణ్యం నియోజకవర్గ అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ విజయాన్ని కాంక్షిస్తూ రోడ్ షో నిర్వహించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె ప్రభాకర్‌రెడ్డి, వి.రాంభూపాల్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల అభ్యర్థితో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. బిజెపి దుర్మార్గాలకు వంత పాడుతున్న టిడిపి, వైసిపిలను ఓడించేందుకు సిపిఎం కృషి చేస్తోందని తెలిపారు. కల్లూరు కాలనీలలో అభివృద్ధి శూన్యమని, గతంలో సిపిఎం ఎమ్మెల్యే ఉన్నప్పుడు చేసిన అభివృద్ధే తప్ప ఇసుమంతైనా అభివృద్ధి చేయని ప్రస్తుత ఎమ్మెల్యేకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు.

విజయవాడ సింగ్‌నగర్‌లోని కండ్రిక, పాయికాపురం, ప్రకాష్ నగర్, పైపుల్‌రోడ్ తదితర ప్రాంతాల్లో సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి చిగురుపాటి బాబూరావు రోడ్ షో నిర్వహించారు. మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కళాకారుల డప్పు వాయిద్యాలతో, మహిళలు కోలాటంతో ప్రదర్శనలు చేశారు. కండ్రిక ప్రాంతమంతా ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ విజయవాడ అభివృద్ధి చెందాలంటే కమ్యూనిస్టులతోనే సాధ్యమన్నారు. టిడిపి, వైసిపిలకు ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. విజయవాడకు ఏం అభివృద్ధి చేశారని ప్రజలను ఓట్లు అడుగుతున్నారో చెప్పాలన్నారు. బిజెపిని, ఆ పార్టీకి మద్దతు తెలుపుతున్న టిడిపి, జనసేన, వైసిపి పార్టీలను ఓడించాలని కోరారు.

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని ముస్తాబాద్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు ర్యాలీ నిర్వహించారు. తొలుత బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. అలాంటి పార్టీకి టిడిపి, జనసేన, వైసిపి మద్దతు తెలపడం దారుణమన్నారు. ప్రజలు ఆలోచించి పని చేసే వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.

అల్లూరి జిల్లా రంపచోడవరం, రాజవొమ్మంగి మండలాల్లో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును గెలిపించాలని కోరుతూ బైక్ ర్యాలీలు నిర్వహించారు. దేవీపట్నం మండలం తాళ్లూరులో పోలవరం నిర్వాసితులతో సిపిఎం నాయకులు సమావేశమయ్యారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. విఆర్.పురం మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

విశాఖలోని వడ్లపూడి రైల్వే క్వార్టర్స్‌లో గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జగ్గునాయుడుకు మద్దతుగా సిపిఎం కార్యకర్తలు గాజువాకలో బైకు ర్యాలీ నిర్వహించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలంలో మంగళగిరి అభ్యర్థి జొన్నా శివశంకరరావుకు మద్దతుగా బైక్ ర్యాలీ జరిగింది. ఉండవల్లి సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మంగళగిరిలోని ద్వారకా నగర్, వడ్లపూడి సెంటర్, మిద్ది సెంటర్, మెయిన్ బజార్, గాలిగోపురం, గౌతమ్ బుద్ధ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్ మీదగా చిన్న కాకాని వరకు కొనసాగింది. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ.. లోకేష్ స్థానికుడు కాదని, టిడిపి ప్రభుత్వంలో మంత్రి పదవి అనుభవించి మంగళగిరికి చేసిందిలేదన్నారు. వైసిపి ప్రభుత్వం మెగా కార్పొరేషన్ పేరిట ఇంటి పన్నుల భారం విపరీతంగా పెంచేసి చెత్త పన్ను వేశారని విమర్శించారు. ప్రజలను ఇబ్బంది పెట్టిన పార్టీలను ఓడించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం వలసబల్లేరులోని గిరిశిఖర గ్రామాలైన ఆగంగూడ, వలసగూడ, వెలగమానుగూడ, చాపరాయిగూడ, వలస బల్లేరు తదితర గిరిజన గ్రామాల్లో కురుపాం నియోజకవర్గ అభ్యర్థి మండంగి రమణ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. సిపిఎంతోనే గిరిజన హక్కులు సాధ్యమని తెలిపారు. తనతోపాటు, అరుకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బిజెపికి పొత్తు, తొత్తులుగా వ్యవహరిస్తున్నా టిడిపి, వైసిపి, జనసేనలను ఇంటికి సాగనంపాలని కోరారు. కొమరాడ మండలం కూనేరు సంతలో సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ర్యాలీ జరిగింది. సాలూరులో ప్రజా కళాకారులు సిపిఎంకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శివాజీ బొమ్మ జంక్షన్‌లో కళాకారులు పాటలు పాడి అలరించారు. అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నెల్లూరులోని జనార్ధన్‌రెడ్డి కాలనీలో నగర నియోజకవర్గ అభ్యర్థి మూలం రమేష్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలతో మాట్లాడారు. నెల్లూరు నగరాభివృద్ధికి తనను గెలిపించాలని కోరారు.


నెల్లూరు జనార్ధన్‌రెడ్డి కాలనీలో ప్రచారం చేస్తున్న మూలం రమేష్


కృష్ణా జిల్లా గన్నవరంలో కళ్లం వెంకటేశ్వరరావు ర్యాలీ


గుంటూరు జిల్లా తాడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న జొన్నా శివశంకరరావు


పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం వలసబల్లేరులో మండంగి రమణకు తిలకం దిద్దుతున్న మహిళ


అల్లూరి జిల్లా రాజవొమ్మంగిలో సిపిఎం నేతల బైక్ ర్యాలీ

అధికారంలోకి వస్తే అమరావతే రాజధాని

జిల్లాల వారీగా ఎస్‌సి వర్గీకరణ చేపడతాం

2029 కల్లా అసెంబ్లీలో 33 శాతం మహిళలు ఉండేలా చట్టం

నంద్యాల, చిత్తూరు ఎన్నికల సభల్లో చంద్రబాబు


నంద్యాల సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, కర్నూలు ప్రతినిధి

అమరావతే రాజధానిగా కొనసాగుతుందని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, బిసి డిక్లరేషన్ తీసుకొస్తూ, వారి శ్రేయస్సుకు లక్షా 50 వేల కోట్లతో నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆది, సోమవారాల్లో తాను ఎక్కడికీ వెళ్లడం లేదని, కంట్రోల్ రూమ్‌లో కూర్చుని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల సరళిని, వైసిపి ఆగడాలను చూస్తుంటానని, ప్రజలు ధైర్యంగా ఓటేసి కూటమిని గెలిపించాలని కోరారు.

నంద్యాల, చిత్తూరు మురకంబట్టు జంక్షన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. జిల్లాల వారీగా ఎస్‌సి వర్గీకరణ చేపడతామన్నారు. 2029 కల్లా అసెంబ్లీలో 33 శాతం మహిళలు ప్రవేశించే దిశగా చట్టం తెస్తామని ప్రకటించారు. రాయలసీమలోని ఒక్క ప్రాజెక్టు కూడా జగన్ పూర్తి చేయలేదని విమర్శించారు. పలు పథకాలకు బటన్ నొక్కి డబ్బులు జమ చేయకుండా దొంగాట ఆడుతున్నారని మండిపడ్డారు. తన చివరి శ్వాస వరకు బిడ్డల భవిష్యత్ కోసం పని చేస్తానన్నారు. తమ హయాంలో పోలవరం 72 శాతం పూర్తి చేశామని, ఆ నీళ్ళు రాయలసీమకు ఇవ్వాలని అనుకున్నామని, కానీ పోలవరాన్ని ముంచే పరిస్థితి జగన్ తీసుకువచ్చారని విమర్శించారు. రెండంకెల అభివృద్ధి చేశామని, వంద సంక్షేమ పథకాలు ఇచ్చామని వివరించారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసం ప్రారంభమైందని, విధ్వంస పాలన కావాలా? అభివృద్ధి కావాలా?, సంక్షోభ పాలన కావాలా? సంక్షేమ పాలన కావాలా?, నడిపించే నాయకుడు కావాలా? అని ప్రశ్నించారు. తాను చేసిన అభివృద్ధి వల్ల జగన్ బటన్ నొక్కారని, ఇప్పుడు డబ్బులు లేకుండా పోయాయని తెలిపారు. స్వతంత్రులతో గ్లాసు గుర్తు ద్వారా ఓట్లను చీల్చాలని చూస్తున్నారని విమర్శించారు. అన్నా క్యాంటీన్, దుల్హన్, రంజాన్ తోఫా, విదేశీ విద్య, చంద్రన్న బీమా, రూ.25 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామని హామీ ఇచ్చారు. 2024-29లో ఈ రాష్ట్రం అభివృద్ధి పరుగులు తీయడానికి తాను, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒక విజినరీ తయారు చేశామని, ఐదేళ్లలో ఈ విజినరీ అద్భుత ఫలితాలు ఇవ్వనుందన్నారు. సాయంత్రం 5.50గంటలకు చంద్రబాబు ప్రచారాన్ని ముగించి, శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం విజయవాడ చేరుకున్నారు. సభల్లో నంద్యాల ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌ఎండి ఫరూక్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్‌మోహన్‌రావు, డాక్టర్ కె.మురళి మోహన్, టిడిపి ఎంపి అభ్యర్థి దుగ్గుమళ్ల ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల ఊబిలో ఆంధ్రప్రదేశ్

బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా


తిరుపతి బహిరంగ సభలో మాట్లాడుతున్న లోకేష్, వేదికపై జెపి.నడ్డా, నాగబాబు

ప్రజాశక్తి - ఆదోని, తిరుపతి

సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన చేతగాని సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఇంటికి సాగనంపాలని బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నడ్డా కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని, తిరుపతి రోడ్‌షో, సభలో ఆయన ప్రసంగించారు. తిరుపతిలో నడ్డాతో పాటు లోకేష్, నాగబాబు పాల్గొన్నారు. నడ్డా మాట్లాడుతూ.. సిఎం జగన్ విచ్చలవిడిగా అప్పులు చేసి అవినీతి, అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు దండుకున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి మళ్లీ సిఎం అయితే రాష్ట్రం మరింత అధోగతి పాలవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఓటుతో జగన్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. ల్యాండ్, సాండ్ మాఫియాలకు వైసిపి ప్రభుత్వం బ్రాండ్‌గా మారిందని విమర్శించారు. తిరుపతిలో ఐటీ సెక్టర్‌ను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. వికసిత భారత్‌లో యువత, మహిళలు, రైతులు, ప్రజలు, కార్మికులు, శ్రామికులు స్వశక్తితో అన్ని రంగాల్లోనూ పురోగమిస్తున్నారన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాట్లాడుతూ.. జగన్ అధికారంలోకి వచ్చాక కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్నవాటిని పక్క రాష్ట్రాలకు తరిమేశారని విమర్శించారు. తిరుపతిలో ఎక్కడ చూసినా భూకబ్జాలు, దందాలేనని, భూమన కుటుంబానికి డబ్బులు ఇస్తేగాని ఇక్కడ పని జరగని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. గతంలో ఇసుక ధర రూ.వెయ్యి ఉండేదని , ఇప్పుడేమో రూ. ఐదు వేలు చేశారని విమర్శించారు. జనసేన రాష్ట్రప్రధాన కార్యదర్శి నాగబాబు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజా ప్రయోజనాల రీత్యా కూటమిగా ఏర్పడ్డ బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తిరుపతి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ప్రసన్న కుమార్ రెడ్డి బిజెపిలో చేరగా కండువా కప్పి పార్టీలోకి జెపి నడ్డా ఆహ్వానించారు.

సూక్ష్మ పరిశ్రమలపై అంతులేని అశ్రద్ధ

- లక్ష్యంచేరని ప్రధాని టాస్క్‌ఫోర్స్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దేశ వ్యాప్తంగా సూక్ష్మ స్థాయి పరిశ్రమలను ఆదుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి టాస్క్‌ఫోర్స్ అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోతోంది. ప్రతి యేటా 10 శాతం వృద్ధి సాధించాలని పిఎం టాస్క్‌ఫోర్స్ ద్వారా నిర్దేశించారు. అన్ని రాష్ట్రాల్లోనూ బ్యాంకుల ద్వారా ఈ సాయం అందించాలని నిర్ణయించినప్పటికీ ఫలితం అంతంతమాత్రమే! ఈ పథకం కింద రాష్ట్ర నిధులకు అదనంగా కేంద్రం కూడా తన వాటాగా కొంత నిధులను సమకూరుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిశ్రమల శాఖ, ఆర్థికశాఖ వంటి కొన్ని కీలక శాఖల సమన్వయంతో రాష్ట్రాల్లోని బ్యాంకుల ద్వారా సాయం అందించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు, ప్రోత్సాహకాలను కూడా గతం నుంచి ప్రభుత్వాలు ప్రకటిస్తూనే ఉన్నాయి. . వీటిని బ్యాంకుల ద్వారా అమలు చేయాల్సి ఉంటుంది. అయితే వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా కేంద్రం నుంచి రావాల్సిన నిధుల వాటా పూర్తి స్థాయిలో రాకపోవడం, బ్యాంకులకు సక్రమంగా నిధులు సమకూర్చకపోవడం, రికవరీలు లేవంటూ కొన్ని దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరిస్తుండటంతో వీటి పురోగతి అంతంతమాత్రమే!

అందుకే నిర్దేశించిన వృద్ధి లక్ష్యాలకు ఏనాడూ ఈ పథకం అందుకోలేకపోయింది.

గత నాలుగేళ్లుగా మైక్రో సంస్థలకు అందించిన సాయం (రూ. కోట్లలో)

ఏడాది	ఖాతాలు	నగదు	ఖాతాల్లో శాతం
2020-21	15,003,75	30,765	2.38
2021-22	15,92,097	38,045	6.11
2022-23	15,44,127	47,619	-3.01
2023-24	16,36,828	63,365	6.55

ధర్మానిదే గెలుపు

కాకినాడ ఎన్నికల ప్రచార సభలో పవన్ కల్యాణ్


ప్రచార సభలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఎన్నికల ప్రచారం ముగిసింది, ఇక కూటమిదే విజయం, ధర్మానిదే గెలుపు అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఎన్నికల ప్రచారం చివరి సభ కాకినాడ సిటీ నియోజకవర్గంలో నిర్వహించారు. బాలాజీ చెరువు సెంటర్లో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అక్రమాస్తుల కేసులో ఉన్న జగన్ దేశం దాటి వెళ్లడానికి కోర్టు అనుమతి తీసుకోవాలన్నారు. అటువంటి వ్యక్తి ముఖ్యమంత్రి అవ్వడం మన దురదృష్టమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అక్రమ బియ్యం వ్యాపారం, గంజాయి అమ్మకం చేస్తున్నాడని, పేకాట క్లబ్‌లను నిర్వహిస్తున్నాడని, మడ అడవులను విధ్వంసం చేశాడని ఆరోపించారు. డ్రగ్స్ మాఫియాను పెంచి పోషిస్తున్నాడని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఇటువంటి అక్రమార్కుల పాలన మారాలంటే టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. మార్పు కోసం మీ బిడ్డల భవిష్యత్తు కోసం కూటమికి ఓటు వేయాలన్నారు.

కాకినాడ ఎంపి అభ్యర్థి సునీల్ ఎన్నికలు జరిగినప్పుడల్లా పార్టీలు మారతారని విమర్శించారు. పార్టీలు మారే వ్యక్తులు కాకుండా స్థిరంగా ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాలని కోరారు. ఆడపిల్లలు అదృశ్యమైతే జగన్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇసుక దోపిడీతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. యూనియన్ నాయకులను బెదిరిస్తున్నారన్నారు. ఇలాంటి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి, సాగు, తాగునీరు సవ్యంగా అందాలంటే కూటమి రావాలన్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమం కూడా అమలు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రకటించిన మేనిఫెస్టో పథకాలను ఆయన వివరించారు. కాకినాడ సిటీ, రూరల్, పార్లమెంటు కూటమి అభ్యర్థులు వనమాడి కొండబాబు, పంతం నానాజీ, ఉదయ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో వైసిపి తప్పుడు ప్రచారం

- టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటమి భయంతో వైసిపి నేతలు అసత్యపు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టిడిపి ఎమ్మెల్సీలు పి అనురాధ, అశోక్ బాబు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్ విమర్శించారు. జగన్ పాలనలో బిసిలు, మైనార్టీలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీల రిజర్వేషన్‌లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌కు కట్టుబడి ఉన్నామని చంద్రబాబు ఇప్పటికే స్పష్టం చేశారని తెలిపారు. వైసిపి పాలనలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా చేసిన సాయం శూన్యమని విమర్శించారు. బిసిలకు సంబంధించిన రూ.75వేల కోట్లను జగన్ దారిమళ్లించారని, 30 పథకాలను రద్దు చేశారని ఆరోపించారు.

బిజెపి హిందుత్వానికి.. మా హిందుత్వానికి తేడా ఉంది : ఉద్ధవ్ థాక్రే



ముంబయి : 'ఇండియా' బ్లాక్‌లో భాగస్వామ్య పార్టీ అయిన శివసేన (యుబిటి) అధినేత, మహారాష్ట్ర మాజీ సిఎం ఉద్ధవ్ థాక్రే బిజెపిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బిజెపి హిందుత్వానికి, తమ హిందుత్వానికి తేడా ఉందని ఎన్నికల ప్రచార సభలో అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ప్రచారంలో థాక్రే మాట్లాడుతూ.. 'మా హిందుత్వం ఇంట్లో పొయ్యిలు వెలిగిస్తుంటే.. బిజెపి హిందుత్వం ఇళ్లను తగలబెడుతోంది.' అన్నారు. ప్రచార సభల్లో ప్రధాని మోడీ పదే పదే ముస్లింల జనాభా పెరుగుదలపై మాట్లాడుతున్నారు. దేశంలో ముస్లిం జనాభా పెరగడం ఆయన విజయమా? లేక వైఫల్యమా అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. ముస్లింల జనాభా పెరుగుదలపై మోడీని అభినందించాలా? లేక విమర్శించాలా అనే దానిపై అయోమయం నెలకొందని ఉద్ధవ్ థాక్రే మండిపడ్డారు. ఇప్పటికైనా హిందువు- ముస్లింల పేరుతో రాజకీయాలు చేయడం బిజెపి మానుకోవాలని థాక్రే సూచించారు. మోడీ డ్రామా కేవలం 4వ తేదీ వరకే కొనసాగుతుందని ఆయన జోస్యం చెప్పారు.

పోలింగ్ సిబ్బందికి పోషకాహారం



సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బందికి సమతుల ఆహారం అందించాలని గ్రామాల్లో పంచాయతి అధికారులను పురపాలికల్లో ప్రత్యేక నియమిత అధికారులను ఆదేశించింది. ఈనెల 12న సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారు. వారికి సాయంత్రం 4 గంటలకు సమోసా, మజ్జిగ, 5 గంటలకు మజ్జిగ లేదా నిమ్మరసం అందిస్తారు. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య శాఖాహార భోజనం (అన్నం, కూర, చపాతీ, టమాటా పప్పు, పెరుగు, చట్నీ) అందిస్తారు. పోలింగ్ రోజు సోమవారం ఉదయం 6 గంటలకు టీ రెండు అరటిపండ్లు, 8 నుంచి 9 మధ్య ఉప్మా, పల్లీల చట్నీ, 11, 12 గంటలకు మధ్య మజ్జిగ అందిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో కోడిగుడ్డు కూర, ఓ కూరగాయ, చట్నీ, సాంబారు, పెరుగు అందిస్తారు. మధ్యాహ్నం 3, 4 గంటల సమయంలో మజ్జిగ లేదా నిమ్మరసం, సాయంత్రం 5.30 గంటలకు టీ, బిస్కెట్లు అందిస్తారు.

కేజ్రీవాల్ ఎన్నికల ప్రచారం



న్యూఢిల్లీ : మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఆప్ అధినేత బెయిల్‌పై బయటకు రావడం ఆ పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది. కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకొచ్చిన అనంతరం ఢిల్లీలో శనివారం నుంచి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. శనివారం దక్షిణ ఢిల్లీలో జరిగిన రోడ్ షోలో కేజ్రీవాల్‌తోపాటు, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ కూడా పాల్గొన్నారు. ఢిల్లీలో ఆరో దశ (మే 25)లో ఎన్నికలు జరగనున్నాయి.

పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ

- రైతుల సమస్యలే ఎన్నికల ఎజెండా
- అగ్నివీర్, ఇండో-పాక్ సరిహద్దు మూత, నిరుద్యోగం, డ్రగ్స్ కూడా..
- కేజ్రీవాల్ అరెస్ట్ ప్రభావం సైతం
- కార్నర్ అవుతున్నది బిజెపియే



జె.జగదీష్

పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్నది. చారిత్రాత్మక రైతు ఉద్యమానికి కేంద్ర బిందువుగా ఉన్న పంజాబ్‌లో రైతు సమస్యల చుట్టే రాజకీయాలు తిరుగుతున్నాయి. పంజాబ్‌లో 13 లోక్‌సభ స్థానాలకు ఒకే దశలో ఏడో విడత (జూన్ 1) ఎన్నికలు జరగనున్నాయి. రైతుల సమస్యలపై ఆప్, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి), కాంగ్రెస్‌లు, బిజెపిని నిలదీస్తున్నాయి. పంజాబ్ గ్రామీణ ఓటర్లలో ఎక్కువ మంది రైతులే కాబట్టి, బిజెపిని కార్నర్ చేయడానికి పార్టీలు రైతుల ఆందోళనను ఎజెండా చేశాయి. ఇప్పటికే అనేక గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి బిజెపి నాయకులు రావడానికి వీలులేదని పోస్టర్లు వేశారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు రైతుల నుంచి బిజెపి నేతలు నిరసనలు ఎదుర్కొన్నారు.

ఎవరికెన్ని?

2019 ఎన్నికల్లో 13 లోక్‌సభ స్థానాల్లో ఎనిమిది కాంగ్రెస్, రెండు ఎస్ఎడి, రెండు బిజెపి, ఆప్ ఒకటి గెలుచుకున్నాయి. 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ విజయ దుందుభి మోగించింది. అప్పటికే ఎంపిగా ఉన్న భగవంత్ మాన్ ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఆయన సిఎం అవ్వడంతో ఖాళీ అయిన సంగ్రూర్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ ఓటమి చెందింది. ఆ ఎన్నికల్లో శిరోమణి అకాలీ దళ్ (అమృత్‌సర్) నేత సిమ్రంజిత్ సింగ్ మాన్ గెలుపొందారు. 2023లో జలంధర్ కాంగ్రెస్ ఎంపి సంతోఖ్ సింగ్ మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ తరఫున సుశీల్ కుమార్ రింఖు భారీ మెజార్టీతో గెలిచారు. ఆయన ఇటీవల బిజెపిలో చేరి జలంధర్ నుంచి పోటీ చేస్తున్నారు.

విడిగానే ఆప్, కాంగ్రెస్,ఎస్ఎడి, బిజెపి

పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ నెలకొంది. ఆప్, కాంగ్రెస్, బిజెపి, ఎస్ఎడి వేర్వేరుగా పోటీ చేస్తున్నాయి. ఆప్, కాంగ్రెస్ మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందని ఆయా పార్టీల నాయకులు ప్రకటించారు. పంజాబ్‌లో ఉభయ పార్టీల నడుమ ఎలాంటి శత్రుత్వమూ లేదు. బిజెపి, ఎస్ఎడి రెండూ అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తున్నాయి. కాగా ఎన్నికల వేళ రాజీనామాలు కాంగ్రెస్ పార్టీకి నష్టం కానున్నాయి. కాంగ్రెస్ పార్టీకి, రాహుల్, ప్రియాంక గాంధీలకు అత్యంత దగ్గర వ్యక్తి లుధియానా సిట్టింగ్ ఎంపి రవ్‌నీత్ సింగ్ బిట్టు బిజెపిలో చేరారు. కాంగ్రెస్ నేత విక్రమ్‌జిత్ సింగ్ చౌదరి, ఆయన తల్లి కరమ్‌జిత్ కౌర్ చౌదరి, తేజిందర్ సింగ్ బిట్టు బిజెపి చేరారు. అంతకుముందు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్, ఆయన భార్య, సిట్టింగ్ ఎంపి ప్రినీత్ కౌర్ బిజెపిలో చేరారు. కాంగ్రెస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ జంక్కర్ కూడా బిజెపిలో చేరారు. ఇది కాంగ్రెస్ పార్టీకి కాస్తంత నష్టమనే చెప్పాలి.


నాలుగు స్థానాల్లో వామపక్షాలు పోటీ

పంజాబ్‌లో నాలుగు స్థానాల్లో సిపిఎం, సిపిఐ పోటీ చేస్తున్నాయి. సిపిఎం తరపున జలంధర్ నుంచి కార్మిక నేత పురుషోత్తమ్ లాల్ బిల్గా బరిలో ఉన్నారు. సిపిఐ తరపున అమృత్‌సర్ నుంచి దస్వీందర్ కౌర్, ఖదూర్ సాహిబ్ నుంచి రైతు నేత గుర్దియాల్ సింగ్, ఫరీద్‌కోట్ నుంచి గుర్చరణ్ సింగ్ మాన్ పోటీ చేస్తున్నారు.



బెడిసికొట్టిన బిజెపి, ఎస్ఎడి పొత్తు వ్యూహం

ఎస్ఎడితో పొత్తును పునరుద్ధరించడానికి బిజెపి చర్చలు జరిపింది. రైతుల ఆందోళన ప్రారంభంతో అది కాస్తా బెడిసికొట్టింది. ప్రధాని మోడీ సభలో స్థానిక ఎంపిగా పాల్గొన్న ఎస్ఎడి నేత హర్ సిమ్రాత్ కౌర్ పై రైతులు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. ఎస్ఎడి పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో బిజెపితో వెళ్తే తీవ్ర నష్టం జరుగుతుందని భావించిన ఎస్ఎడి, పొత్తు అంశాన్ని పక్కన పెట్టింది.



అగ్నివీర్ పై ఆగ్రహం

సైన్యంలో అత్యధికంగా ఉన్న పంజాబీలు మోడీ సర్కారు తెచ్చిన అగ్నివీర్ పథకాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రావాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయట్లేదని అధికార ఆప్ తరచూ బిజెపిని నిలదీస్తోంది. రూ. 8 వేల కోట్లను నిలిపేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బిజెపి విచ్ఛిన్నం చేసిందని ఆప్ నాయకులు చెబుతున్నారు. నిరుద్యోగం, గ్రామీణ రుణాలు కూడా రాష్ట్రంలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. అట్టారీ సరిహద్దు ద్వారా ఇండియా - పాకిస్తాన్ మధ్య వాణిజ్యం మూసివేయడం ప్రధాన సమస్యలలో ఒకటి. ఇది పంజాబ్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేసింది. 2019లో పుల్వామా దాడి కారణంగా ఇండియా- పాక్ మధ్య వాణిజ్యం నిలివేశారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ (ఐసిపి)ని తిరిగి తెరవాలని వాణిజ్య సంస్థలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. కేజ్రీవాల్ అరెస్ట్ ప్రభావం ఎన్నికలపై పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నాలుగో దశ అభ్యర్థుల్లో 28 శాతం మంది కోటీశ్వరులు

దేశ వ్యాప్తంగా నాల్గవ దశ లోక్‌సభ ఎన్నికలు (మే 13) పది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 96 నియోజకవర్గాలకు నిర్వహిస్తున్నారు. ఈ దశలో 1,710 మంది పోటీ చేస్తుండగా, వారిలో దాదాపు 476 మంది కోటీశ్వరులేనని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్), ద నేషనల్ ఎలక్షన్ వాచ్ నివేదిక వెల్లడించింది. బరిలో నిలిచిన అభ్యర్థుల్లో దాదాపు 28 శాతం కోటీశ్వరులేనని తెలిపింది. అభ్యర్థుల అఫిడవిట్‌ల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. ఏడుగురు అభ్యర్థుల అఫిడవిట్‌లు సరిగ్గా స్కాన్ చేయకపోవడంతో వారి ఆస్తుల వివరాలు నివేదికలో పొందుపరచలేదు. పోటీలో నిలిచిన వారిలో 12 శాతం మంది ఐదు కోట్లు, అంతకంటే ఎక్కువ ఆస్తులు కలిగి ఉన్నారు. ఎనిమిది శాతం మందికి రూ. 2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఆస్తులున్నాయి. 18 శాతం మంది రూ. 50 లక్షల నుంచి రూ. 2 కోట్ల వరకు ఆస్తులు కలిగి ఉన్నారు. 25 శాతం మంది రూ. 10 లక్షల నుంచి రూ. 50 లక్షల మధ్య ఆస్తులు కలిగి ఉన్నారు. 37 శాతం మందికి రూ. 10 లక్షల లోపు ఆస్తులు ఉన్నాయి.



2023-24లో అభ్యర్థి ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటిఆర్) ప్రకారం చూస్తే.. కాంగ్రెస్ పార్టీకి చెందిన షేక్ బషీద్ అత్యధిక ఆదాయం కలిగిన అభ్యర్థుల జాబితాలో నిలిచారు. ఆయన ఈసారి ఆంధ్రప్రదేశ్ రాజంపేట నుంచి పోటీ చేస్తున్నారు. వ్యాపారం ద్వారా రూ.28,63,66,000 ఆదాయం వచ్చింది. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బిజెపి) తెలంగాణ చేవెళ్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయనకు జీతం, వడ్డీ, అద్దె, డివిడెండ్ ఆదాయాల రూపంలో రూ. 4,65,48,830 ఆదాయం వస్తుంది. కాంగ్రెస్ నేత డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి కూడా అత్యధిక ఆదాయం కలిగిన జాబితాలో ఉన్నారు. ఆయన చేవెళ్ల నుంచే పోటీ చేస్తున్నారు. జీతం, వ్యాపారం, ఇతర వనరుల ద్వారా రూ.4,92,63,730 ఆదాయం లభించింది.

సగటు ఆస్తి రూ.11.72 కోట్లు

టిడిపి నుంచి 17 మంది అభ్యర్థులు (416.42 కోట్లు). బిజెపి 70 మంది (రూ.101.77కోట్లు.). శివసేన ముగ్గురు (రూ. 54.49 కోట్లు). బిఆర్ఎస్ 17 మంది (రూ. 54.25 కోట్లు). వైసిపి 25 మంది (రూ. 39 కోట్లు). టిఎంసి ఎనిమిది మంది (రూ. 36 కోట్లు.), కాంగ్రెస్ 61 మంది (రూ. 23.65 కోట్లు). శివసేన (యుబిటి) నలుగురు (రూ. 13.53 కోట్లు). ఎస్‌పి 19 మంది (9.86 కోట్లు.), ఎంఐఎం ముగ్గురు (రూ.9.53 కోట్లు.), ఆర్‌జెడి నలుగురు (రూ. 8.23 కోట్లు). బిజెడి నుంచి నలుగురు అభ్యర్థులు (రూ. 3.11కోట్లు). నాల్గవ దశలో పోటీ చేసే ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తి రూ.11.72 కోట్లుగా ఉంది.


ఎలక్షన్ డెస్క్

టాపర్లు వీరే


1) టిడిపి నుంచి పెమ్మసాని చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ గుంటూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన ఆస్తుల విలువ రూ. 5,705 కోట్లు. 2) కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బిజెపి) తెలంగాణ చేవెళ్ల నియోజకవర్గం. ఆయన మొత్తం ఆస్తులు రూ. 4,568 కోట్లు. 3) ప్రభాకర్‌రెడ్డి వేమిరెడ్డి (టిడిపి) నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఆస్తులు రూ. 716 కోట్లు.



పెమ్మసాని చంద్రశేఖర్



కొండా విశ్వేశ్వరరెడ్డి



ప్రభాకరరెడ్డి వేమిరెడ్డి

కలం బాణాలు

ప్రచారం పరిసమాప్తం



హోరాహోరీ తీరున
సాగిన ఆ ప్రచారం
ముగిసిపోయెలే నేడు
మిగిలిందిక సమరం

దూషణలూ ఘోషణలకు
ఇద్దామిక విశ్రాంతి
ఓటరు యోచన కోసం
కావద్దా మనశ్శాంతి

ఎన్నికల తర్వాతే సంక్షేమం : ఇసి

మాకన్నా వారెక్కువా
చెప్పు న్యాయదేవత
హైకోర్టును మించేనా
ఎస్ఇసి స్తోమత

డిబిటి ఇచ్చేందుకు
ఒక్కరోజు అనుమతి
మళ్ళీ ఆపేశారని
సిజె బెంచ్ కోపశతి



మళ్లీ మోడీ విద్వేష వ్యాఖ్యలు



పేదగరీబ్ సాయెబులకు
కాస్త రిజర్వేషను
ఇస్తే తప్పేమున్నది
ఆపడమేం మిషను?

మోడీజీ దేశానికీ
ప్రధానిగా తమరు
మతంలెక్కలే కడితే
రాజనీతి అనరు

- తె.ర



రంపచోడవరంలో త్రిముఖ పోరు

- సిపిఎం అభ్యర్థి లోతా రామారావుకు ఆదరణ
- వైసిపి అభ్యర్థిపై ప్రజా వ్యతిరేకత
- విమర్శలు, ఆరోపణల వలయంలో టిడిపి అభ్యర్థి



ప్రజాశక్తి - రంపచోడవరం, రాజవొమ్మంగి విలేకరులు (అల్లూరి జిల్లా)

అల్లూరి జిల్లా రంపచోడవరంలో రాజకీయం రసవత్తరంగా మారింది. వైసిసి, టిడిపి, సిపిఎంల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. పోలవరం నిర్వాసితుల సమస్యలపైనా, ఆదివాసీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యంపైనా మొదటి నుంచీ పోరాడుతున్న సిపిఎంకు ఈ ఎన్నికల్లో మంచి ఆదరణ లభిస్తోంది. నియోజకవర్గంలో 11 మండలాలున్నాయి. పోలవరం నిర్వాసితులు ఇక్కడి గెలుపోటములను ప్రభావితం చేయనున్నారు. నియోజకవర్గంలో కూటమి తరుపున టిడిపి అభ్యర్థి మిరియాల శిరీషా దేవి, వైసిపి నుంచి నాగులాపల్లి ధనలక్ష్మి, సిపిఎం నుంచి లోతా రామారావు బరిలో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వైసిపి అభ్యర్థి ధనలక్ష్మిపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ఈ ఐదేళ్లలో ఆమె ఈ ప్రాంత సమస్యలను, ప్రధానంగా పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో, వరదల సమయంలో పట్టించుకోకపోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. బోయ / వాల్మీకిలను ఎస్‌టి జాబితాలో చేర్చడం, జిఓ నెంబర్ 3 రద్దు, ఇతర ఆదివాసీల హక్కులను హరించే సమయంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి నోరు మెదపకపోవడం వంటి కారణాల వల్ల ఆమె పట్ల వ్యతిరేకత నెలకొంది. ఎమ్మెల్సీగా ఉండి రంపచోడవరం ఏజెన్సీలో అన్ని వ్యవహారాలనూ చక్కబెడుతున్న అనంతబాబుపైనే ఆమె ఆధారపడి ఉన్నారు. అనంతబాబు పలు కేసుల్లో నిందితుడు. తన కారు డ్రైవర్‌ను హత్య చేసిన కేసులో జైలుకెళ్లిన వ్యక్తి. ఎన్నికల సందర్భంగా సిబ్బంది, పోలీసు అధికారుల విధులకు ఆటంకం కలిగించిన కేసులూ ఆయనపై ఉన్నాయి. తనకు ఎదురుతిరిగిన వారిపై దాడులకు పాల్పడటం, బెదిరింపులకు దిగడం ఆయన చేస్తుంటారు. ఆయన తీరుపట్ల నేడు ఏజెన్సీ అంతటా వ్యతిరేకత నెలకొంది.


అవినీతి ఆరోపణలు

టిడిపి అభ్యర్థి శిరీషా దేవి రాజకీయాలకు పూర్తిగా కొత్త. ఆదివాసీలు, ముఖ్యంగా పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఆమెకు అవగాహన లేదు. ఆమె భర్త మఠం భాస్కర్‌పై బోలెడు ఆరోపణలు ఉన్నాయి. చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో ఆయన సిద్ధహస్తుడని నియోజకవర్గంలో చెప్పుకుంటారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని సుమారు రూ.కోటి వరకు గతంలో వసూలు చేసి మోసగించినట్టు ఆరోపణలున్నాయి. గత టిడిపి ప్రభుత్వ హయాంలో మురుగుదొడ్ల డబ్బులు కూడా తినేసారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఇవి టిడిపి అభ్యర్థి గెలుపోటములను ప్రభావితం చేయనున్నాయి.

సిపిఎం వైపు ప్రజల మొగ్గు

సిపిఎం నుంచి లోతా రామారావు బరిలో ఉన్నారు. ఇండియా వేదికలోని కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ (ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా), ఏజెన్సీ గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాలు ఆయన్ని బలపరుస్తున్నాయి. ఏజెన్సీలోని సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని మాజీ కేంద్ర మంత్రి వై.కిషోర్‌చంద్రదేవ్ బహిరంగంగా ప్రకటించడం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ఇటీవల రంపచోడవరంలో పర్యటించి రామారావును గెలిపించాలని కోరడం వంటివి కొత్త ఉత్తేజాన్ని ఇస్తున్నాయి. రామారావు ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. లోదొడ్డి పంచాయతీకి రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికై ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారు. రాష్ట్ర విభజన తరువాత ఈ పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విలీన మండలాలను, ఇక్కడి నిర్వాసితులను గాలికొదిలేసిన వైనాన్ని ప్రజల్లోకి ఆయన బలంగా తీసుకెళ్లారు. కూనవరంలో ఈ నెల 9న నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడంతో సిపిఎం శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుల ప్రసంగం ఆ సభలో నిర్వాసితులను ఆలోచింపజేసింది. సిపిఎంకు ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగ యువత నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది. ప్రధాన పోటీదారుగా సిపిఎం బలపడిందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మతోన్మాద బిజెపి తమను అడవి నుంచి తరిమేసే కుట్రలను పసిగట్టిన ఆదివాసీలు మోడీ సర్కారుకు వ్యతిరేకంగా సంఘటితమవుతున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి గెలిస్తే రాజ్యాంగం రద్దుతో పాటు ఆదివాసీల చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని వారంతా భావిస్తున్నారు. వైసిపి, టిడిపి గెలుపు.. బిజెపి గెలిపేనని ప్రజలు అనుకుంటున్నారు. పోలవరం నిర్వాసితుల్లోనూ ప్రధాన పార్టీలు ఏవి గెలిచినా మరణ శాసనమే కానుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే బిజెపిని, దానికి తొత్తులుగా ఉన్న టిడిపి, వైసిపిలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. 2022 జులైలో గోదావరి వరదలు ముంపు మండలాలను అతలాకుతలం చేసిన సమయంలో వైసిపి, టిడిపి, బిజెపిలు నిర్వాసితుల పక్షాన నిలవలేదు. సిపిఎం మాత్రమే ప్రజల పక్షాన నిలబడింది. వరదల సమయంలో నాలుగు మండలాల్లో సిపిఎం గ్రామ గ్రామానా భోజనాల ఏర్పాటు చేసింది. విస్తృతంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. గత ఏడాది నెల్లిపాక నుండి ముంపు మండలాల మీదుగా విజయవాడ వరకు నిర్వాసితుల పక్షాన సిపిఎం పోలవరం పోరుకేక పేరిట పాదయాత్ర నిర్వహించింది. దీంతో ఆ సమస్య జాతీయస్థాయికి వెళ్లింది. పదేళ్ల కాలంలో ఈ ప్రాంత సమస్యలను పట్టించుకోని టిడిపి, వైసిపిలపై ప్రజల్లో ఉన్న తీవ్రమైన వ్యతిరేకత సిపిఎంకు సానుకూలంగా మారనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సిపిఎం ఎమ్మెల్యేలుగా నాడు గెలిచి విశేష సేవలందించిన కుంజా బొజ్జి, సున్నం రాజయ్యలను ఇక్కడి ప్రజలు గుర్తుచేసుకుంటూ మళ్లీ ఎర్రజెండాను ఇక్కడ గెలిపించాలని అనుకుంటున్నారు.


లోతా రామారావు



నాగులాపల్లి ధనలక్ష్మి
మిరియాల శిరీషా దేవి

మైకులు బంద్

- రాష్ట్రంలో ముగిసిన ప్రచారం
- మూత పడిన మద్యం షాపులు, బార్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రోజుల తరబడి హోరెత్తిన మైకులు మూగబోయాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శనివారం సాయంత్రం ఐదు గంటలకు రాష్ట్రంలో ప్రచార పర్వం ముగిసింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే రాష్ట్రంలో ప్రారంభమైన ప్రచార పర్వం నోటిఫికేషన్ విడుదలైన తరువాత తీవ్రస్థాయినందుకుంది. ఎన్నికల బరిలో నిలిచిన అన్ని పార్టీలు పోటాపోటీగా ప్రచారం సాగించాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మార్చి 27వ తేదీన మేమంతా సిద్ధం బహిరంగ సభకు శ్రీకారం చుట్టి 106 నియోజకవర్గాల్లో బస్సుయాత్రలు, ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. అలాగే బస్సు యాత్రలో భాగంగా 16 సిద్ధం సభలు, 34 ప్రచార సభలు, 14 నియోజకవర్గాల్లో రోడ్ షోలు నిర్వహించారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరుతో 89 నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. అంతకుముందు రా



కదలిరా పేరుతో 25 పార్లమెంట్లలో భారీ బహిరంగలు నిర్వహించారు. ప్రజాగళం, రా కదలిరా సభలతో కలిసి చంద్రబాబు 104 నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. ఇక జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా వివిధ పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం పూర్తిచేశారు. ప్రచార పర్వం ముగియడంతో పాటే, డ్రైడే అమలులోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఏడు గంటల నుండి మద్యం దుకాణాలు, బార్లు మూసివేశారు. 48 గంటల పాటు ఈ మూసివేత కొనసాగనుంది. సోమవారం సాయంత్రం ఏడు గంటల వరకు ఈ నిషేదం కొనసాగనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2934 మద్యం దుకాణాలు (ప్రభుత్వం నిర్వహించే), 458 టూరిజం అవుట్‌లెట్‌లు, 840 బార్లు, 42 స్టార్ హోటల్ బార్స్, 8 మైక్రో బేవరి బార్స్, 31 టిడి1 బార్లు, 22 క్లబ్బులు నడుస్తున్నాయి. వీటన్నింటిలోనూ మద్యం విక్రయాలు నడుస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో మొత్తం ఇవన్నీ మూత పడ్డాయి.





పోలింగ్‌కు ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ నుంచి 339, బెంగళూరు నుంచి 323 సర్వీసులు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. ఈ నెల 13న రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రెగ్యులర్‌గా నడిచే సర్వీసులతో పాటు అదనపు సర్వీసులు ఏర్పాటు చేశామని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. హైదరాబాద్‌నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు నడిచే 339 సర్వీసులతోపాటు ఈ నెల 11వ తేదీన 302, 12వ తేదీన 206 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్ నుంచి ఒంగోలుకు 38, ఏలూరుకు 20, మచిలీపట్నంకు 23, విజయవాడకు 45, గుంటూరుకు 18, నరసరావుపేటకు 26, నెల్లూరుకు 17, నంద్యాలకు 19, విశాఖకు నాలుగు సర్వీసులు నడుపుతున్నట్లు వెల్లడించారు. బెంగళూరు నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు 11వ తేదీన 323 సర్వీసులు, 12వ తేదీన 269 బస్సులను నడుపుతున్నామని, రెగ్యులర్‌గా నడిచే బస్సులకు ఇవి అదనం అని ప్రకటించారు. విజయవాడ నుంచి విశాఖ, రాజమండ్రి, తిరుపతి, నెల్లూరు, కాకినాడ, ఏలూరు, ఒంగోలు, గుంటూరు ప్రాంతాలకూ ప్రత్యేక బస్సులు నడుస్తున్నాయని చెప్పారు. ఈ బస్సు సర్వీసులన్నీ సాధారణ ఛార్జితోనే నడుస్తున్నాయని, ఓటు వేసి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసమూ ప్రత్యేక సర్వీసులు ఉంటాయని ఆయన తెలిపారు.



దివిసీమలో గెలుపెవరిదో?

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. వైసిపి, ఎన్‌డిఎ కూటమి తరపున జనసేన, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోటీ ఉత్కంఠగా మారింది. వైసిపి అభ్యర్థిగా సిట్టింగ్ ఎంఎల్‌ఎ సింహాద్రి రమేష్‌బాబు, టిడిపి, బిజెపి బలపరిచిన జనసేన అభ్యర్థిగా మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, సిపిఎం, సిపిఐ, ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా అందె శ్రీరామమూర్తిలు పోటీలో ఉన్నారు. ఎన్నికల ప్రచారం ముగియడంతో అభ్యర్థులంతా పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహరచనలో మునిగిపోయారు. 2009లో ఎంఎల్‌ఎ రమేష్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఈ నియోజకవర్గం నుంచి తొలుత పిఆర్‌పి అభ్యర్థిగా, 2014లో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 ఫ్యాన్ హవాలో 20,725 ఓట్ల అత్యధికతో గెలుపొందారు. మరోసారి వైసిపి తరుపున పోటీలో ఉన్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఈ ఎన్నికల్లోనూ తనను గట్టెక్కిస్తాయని రమేష్ ఆశిస్తున్నారు. ఆయన గెలుపు ఈసారి అంత ఈజీ కాదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. రహదారుల మరమ్మతులతోపాటు ధాన్యం సేకరణపైన తీవ్ర నిర్లక్ష్యం వహించారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రైతులు తమ ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అయినకాడికి అమ్ముకోవాల్సి వచ్చింది. 75 కిలోల బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకు మద్దతు ధరలో కోత పడింది. ఎక్కువ సంఖ్యలో రైతులు పెద్దమొత్తంలో నష్టపోయారు. ఆక్వా సాగు సంక్షోభంలో పడినా స్పందించకపోవడంతో రమేష్‌పై నియోజకవర్గంలో వ్యతిరేకత ఉంది. నాగాయలంక మండలం ఎదురుమొండి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని, డ్రెయినేజీ ముంపు సమస్య పరిష్కారం కోసం, అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల నిర్మాణం, పాత ఎడ్లంక వంతెనల నిర్మాణం, కరకట్టలను పటిష్ట పరుస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు కాలేదు. ఈ నియోజకవర్గ పరిధిలోని కృష్ణానది పరీవాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణా పెద్దఎత్తున జరిగిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రమేష్‌పై ప్రజల్లో ఒకింత వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మాజీ మంత్రి, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు తొలుత కాంగ్రెస్ నుంచి రెండుసార్లు, రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి నుండి ఎంఎల్‌ఎగా గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి పొత్తులో భాగంగా జనసేనకు ఈ సీటును కేటాయించింది. దీంతో బుద్ధప్రసాద్‌కు ఈ సీటు కేటాయించలేమని టిడిపి స్పష్టం చేసింది. దీంతో ఆయన అనూహ్యంగా టిడిపి కండువా మార్చి జనసేన అభ్యర్థిగా రంగంలో దిగారు. ఈ సీటును ఆశించిన జనసేన నేతలు బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. వీరితో చర్చలు జరిపి అసమ్మతి వ్యక్తం చేసిన వారిలో ఎక్కువ మందిని తన వెంట ప్రచారంలో తిప్పుకున్నారు.

ఇదే నియోకజకవర్గంలో గత ఎన్నికల్లో జనసేనకు 28,556 వేలకుపైగా ఓట్లు పోలయ్యాయి. సంప్రదాయంగా టిడిపికి ఉన్న బలానికి జనసేన ఓట్లు తోడవ్వడం, ప్రభుత్వ వ్యతిరేకత బుద్ధప్రసాద్‌కు కలిసి వస్తాయని చెబుతున్నారు. బిజెపితో కలవటం వల్ల ముస్లిములు, మైనార్టీల ఓట్లు ఎటుపడతాయనేది అర్థం కాకుండా ఉంది.

మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థి శ్రీరామమూర్తి సైతం నియోజకర్గంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. రైతాంగ సమస్యలు, మౌలిక వసతుల కల్పన, లక్ష్మీపురంలో కెసిపి చక్కర కర్మాగారం మూతపడటం తదితర సమస్యలు ప్రస్తావిస్తూ ప్రచారం నిర్వహించారు. ఇండియా వేదిక, కాంగ్రెస్ పార్టీల మేనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఇక ముగ్గురు అభ్యర్థులు చివరి నిమిషంలో పోల్ మేనేజ్‌మెంట్‌కు సన్నాహాలు చేసుకున్నారు. ప్రచారం ముగిసిన వెంటనే దళాలను ఏర్పాటు చేసి డోర్ క్యాంపెయిన్ చేపట్టారు. మరోపక్క వైసిపి, జనసేన పార్టీలు ఓటుకు రూ.1000 చొప్పున ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పంపిణీ చేశాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌లకు తీసుకొచ్చేందుకు పెద్ద సంఖ్యలో వాహనాలను సమకూర్చే ప్రయత్నాలు చేస్తున్నాయి.


సింహాద్రి రమేష్‌బాబు


మండలి బుద్ధప్రసాద్


అందె శ్రీరామమూర్తి





అప్పుడలా...ఇప్పుడిలా...

- టిడిపి ప్రచార అస్త్రంగా 'ల్యాండ్ టైట్లింగ్'
- 2019లో వైసిపి ప్రచార అస్త్రంగా డేటా చౌర్యం
- 2024లో దస్తావేజుల జిరాక్స్ కాపీల అంశంతో తిప్పికొట్టిన చంద్రబాబు
- ఎన్‌డిఏ ప్రభుత్వానికి జగన్ జీ హుజూర్ అన్నందుకు ఫలితం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కోసారి ఒక్కో వివాదాస్పదమైన అంశం తెరపైకి వస్తోంది. ఈ అంశాలే ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తుంటాయి. రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వంపై అప్పటి ప్రతిపక్ష పార్టీ వైసిపి డేటా చౌర్యం అంశాన్ని తెర పైకి తెచ్చింది. తెలుగుదేశం. మళ్లీ అధికారంలోకి వస్తే మీ బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్ము మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పుడైనా లాగేసుకుంటుందని, ప్రజల ఆధార్ డేటా మొత్తం కొంతమంది ప్రయివేటు వ్యక్తులకి అప్పజెప్పారని, మొత్తం తస్కరణకు గురైందని వైసిపి అప్పట్లో తీవ్ర దుమారాన్నే లేపింది. ఎన్నికల ప్రచారంలో ఇదే అంశాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మార్చుకుంది. ప్రజల్లో భయాన్ని సృష్టించింది. బ్యాంకుల్లో ఎవరు ఖాతాలో ఎంత ఉన్నాయో తెలిసిపోతుందని ఎవరైనా సొమ్ములు లాగేసుకోవచ్చని భయపెడుతూ ఎన్నికల ప్రచారంలో ఇదే అంశాన్ని వైసిపి ఊరూవాడా ప్రచారం చేసింది. అప్పట్లో ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి స్వయంగా ఇదే అంశాలను చెప్పటంతో భయం పెరిగి అప్పటి టిడిపి ప్రభుత్వంపై వ్యతిరేకతకు దారితీసింది. అయితే ఈసారి ఎన్నికల్లో ప్రస్తుతం అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకుంది. ఈయాక్ట్ ద్వారా ప్రజల భూములను సిఎం జగన్, వైసిపి నాయకులు కాజేస్తారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పెద్దఎత్తున ప్రచారాన్ని చేశారు. టిడిపి అభ్యర్థులు కూడా ఇదే అంశాన్ని విస్తృతంగా ఉపయోగించారు. మీ భూములకు సంబంధించిన పాస్ పుస్తకంపై సిఎం జగన్ ఫోటో ఎందుకు? గతంలో ఏ ముఖ్యమంత్రి అయినా పాస్ పుస్తకాలపై తన ఫోటో వేసుకున్నారా? సర్వే పేరుతో పొలాల్లో హద్దు రాళ్లపై సిఎం జగన్ ఫోటోలు వేసుకున్నారని మీ పొలంలో సిఎం ఫోటోలు ఎందుకు భవిష్యత్తులో మీ భూమి మీది కాదు.నాది అంటే ఏం చేస్తారు అని భయపెడుతున్నారు. అంతేగాక ల్యాండ్ టైట్లింగ్ యాక్టుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధం లేకపోయినా ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఇక మీదట ఒరిజినల్ దస్తావేజులు ఇవ్వరని, జిరాక్సులు మాత్రమే ఇస్తారట..ఓరిజినల్ దస్తావేజులు ప్రైవేటు ఏజెన్సీ వద్ద ఉంచి ప్రభుత్వం తాకట్టు పెట్టుకుని రుణం తెచ్చుకుంటే మీరేం చేస్తారు? మీరు ఒరిజినల్ దస్తావేజులు లేకుండా రుణం ఎలా పొందుతారు? క్రయ విక్రయాలు ఎలాచేస్తారని ప్రజలను టిడిపి తీవ్ర స్థాయిలో భయపెట్టింది. దీంతో ఇప్పటి వరకు వైసిపికి కొంత సానుకూలంగా ఉన్న గ్రామీణ వాసుల్లో తమ ఆస్తులకు రక్షణ లేదంటూ భయాందోళనకు గురయ్యారు. దీంతో గ్రామాల్లో వైసిపి నాయకులను ప్రజలు నిలదీసిన ఉదంతాలు కూడా కొనసాగాయి. మా పాసు పుస్తకాలపై సిఎం ఫోటో ఎందుకు అని పులివెందులలో జగన్ సతీమణి వైఎస్ భారతిని వైసిపికి చెందిన భాస్కరరెడ్డి అనే రైతు నిలదీసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. గత ఆరు నెలలుగా ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు ఆందోళన చేస్తున్నా సిఎం జగన్ ఎప్పుడూ స్పందించలేదు. తగిన వివరణ ఇవ్వలేదు. ఇప్పుడు ఎన్నికల ప్రచారంలో టిడిపి, జనసేన నాయకులు ఇదే అంశాన్ని ప్రధాన ప్రచార అస్త్రంగా మార్చుకోవడంతో కంగారు పడిన వైసిపినాయకులు సిఎం జగన్‌పై ఒత్తిడి తెచ్చి గత వారం రోజుల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఈ చట్టం వల్ల ప్రజలకు నష్టం ఉండదని, శాశ్వత భూ హక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతోందని వివరణ ఇచ్చారు. పలువురు మంత్రులతోపాటు సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రం నీతి ఆయోగ్ సూచనల మేరకు, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చట్టం తెచ్చామని వివరణ ఇచ్చారు. గత ఐదేళ్ల కాలంలో కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా ఇతర రాష్ట్రాలు అమలు చేయకపోయినా ఆంధ్ర ప్రదేశ్‌లో మాత్రం చాలా వేగంగా ప్రజలను, ప్రజా ప్రతినిధులను, మేధావులను, సంబంధిత శాఖలను సంప్రదించకుండా ఎటువంటి చర్చ లేకుండా ఇలాంటి చట్టాలను వైసిపి ప్రభుత్వం ఏకపక్షంగా ప్రజలపై బలవంతంగా రుద్దింది. ప్రధానంగా 2011లోఉన్న కౌలు రైతు చట్టం స్థానంలో 2019 కౌలు రైతు చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం వల్ల భూ యజమాని అనుమతిలేకుండా కౌలు రైతులకు కనీసం గుర్తింపు కార్డు, బ్యాంకు రుణం, ఇతర సదుపాయాలు దక్కని పరిస్థితి నెలకొంది. రైతు సంఘాలు ఎన్ని సార్లు మొత్తుకున్నా వైసిపి ప్రభుత్వం భూ యజమాని అనుమతి నిబంధన తొలగించలేదు. నూతన విద్యా విధానం (ఎన్‌ఈపి) అమలుకు చేసిన చట్టం, పాఠశాల విద్యావ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చడం, వీలీనం పేరుతో పాఠశాలల ఎత్తివేత, ఐదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకం చేయకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ప్రాథమిక, సెకండరీ విద్యా వ్యవస్థ దారుణంగా దెబ్బతినే పరిస్థితులు ఏర్పడ్డాయి. కేంద్రం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణ బిల్లుకు అనుగుణంగా రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్టు మీటర్ల బిగింపు నిర్ణయం అమలుతో ఉచిత విద్యుత్ విధానం ప్రశ్నార్థకంగా మారింది. ఇలాంటి చట్టాల ద్వారా కేంద్రం చెప్పిన ప్రతి అంశానికి తలూపి ఏ రాష్ట్రంలో లేని విధంగా నూతన చట్టాలను అమలుకు పూనుకున్నారు. ఇందులో భాగంగానే ల్యాండ్ టైట్లింగ్ సర్వే ద్వారా కాంట్రాక్టు సేద్యానికి సానుకూలత పెంచేలా కార్పొరేట్ రంగాలకు మేలు చేసేలా చట్టం రూపకల్పన చేశారని విమర్శలు కూడా వచ్చాయి. ఈ చట్టానికి అసెంబ్లీలో మద్ధతు ఇచ్చినా చట్టంలో లొసుగులను టిడిపి ఎన్నికలలో ప్రచార అస్త్రాలుగా మార్చుకుని వైసిపికి ప్రజల్లో వ్యతిరేకత కల్పించడంలో ఇప్పటికే దాదాపుగా సఫలీకృతం అయ్యిందనే వాదన విన్పిస్తోంది. ఇదే అంశాన్ని వైసిపి నాయకులు కూడా అంగీకరిస్తున్నారు. చట్టంలోని లొసుగులను చంద్రబాబుకు అనుకూలంగా ఉండే ఐఎఎస్‌లు ఉప్పందించారని దీన్ని మంచి అవకాశంగా తీసుకుందని సీనియర్ వైసిపి నాయకులు వాపోతున్నారు. ప్రజల్లో ఉన్న భయాలను తొలగించి టిడిపి విమర్శలను తిప్పికొట్టడంలో వైసిపి ఇప్పటికీ సఫలీకృతం కాలేకపోతుందని, జరగాల్సిన నష్టం జరిగిపోయిందని మాజీ మంత్రి ఒకరు తెలిపారు.





సంపాదకీయం

ఓటు మన హక్కు

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు. 'కూటికి గుడ్డకున్ ప్రజలు, కొంగరవోవుచుండ నీటుగా/ మోటారుబండ్లపై నగదు మూటలతో కలవారి ఓటు భి/ క్షాటన సాగుచున్నయది జాగ్రత్త! దేశనివాసులారా! మీ/ యోటులు స్వీయ భారత సముజ్వల గాత్రికి సూత్ర బంధముల్' అంటారు గుర్రం జాషువా. ఓట్ల కోసం డబ్బు మూటలతో వచ్చినా... ప్రజలు వివేకంతో వేసే ఓట్లు 'స్వీయ భారత సముజ్వల గాత్రికి సూత్రబంధముల్' అన్న ఆశాభావాన్ని 1960వ దశకంలోనే వ్యక్తం చేశాడు జాషువా. అంతేకాదు, పొరపాటున చేయిజారి అయోగ్యులకు ఓటు వేస్తే.. దగాకోరు నాయకులు అధికారంలోకి వచ్చి, దేశాన్ని సమస్త కష్టాలకు గురిచేస్తారని కూడా ఆయన హెచ్చరించాడు. ఓటు వేయడం అంటే... దేశ భవితను, ప్రజలను సక్రమంగా నడిపించగల వారిని ఎన్నుకోవడం. ఓటుకు మన తలరాతలు మార్చే శక్తి వుంది గనుకనే దానికంత విలువ. 'బ్రూటున కేసిన ఓటు/ బురదలో గిరవాటు/ కడకు తెచ్చును చేటు/ ఓ కూనలమ్మ' అంటారు ఆరుద్ర. అవినీతిపరులను, ప్రజావ్యతిరేకులను ఓడించే శక్తి ఓటుకు వుంది. నేనొక్కడిని ఓటు వేయకపోతే ఏమౌతుందిలే అనుకుంటుంటారు చాలామంది. కానీ, ఓటు మన హక్కు. కొన్ని దేశాల్లో ఓటు హక్కును వినియోగించుకోక పోతే జరిమానా విధిస్తారు.

'ప్రతి ఎన్నికలను ప్రజలే నిర్ణయిస్తారు' అంటారు లారీ జె. సబాటో. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందిన భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలైంది. 1947లో 30 కోట్లు వున్న దేశ జనాభా... నేడు 140 కోట్లను దాటేసింది. తొలిసారిగా 1951లో 26 రాష్ట్రాలలోని 489 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పారిశ్రామిక, సేవా సంఘాలు అభివృద్ధి చెందాయని చెప్పుకుంటున్నప్పటికీ... ఐరాస లెక్కల ప్రకారం మన దేశం చాలా రంగాల్లో వెనకబడే వుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత... మనం ఎన్నుకునే రాజకీయ నాయకులది. అయితే, స్థానిక పంచాయతీ వార్డు మెంబర్ నుంచి... పార్లమెంట్ మెంబర్ వరకూ సరైన వారిని అత్యధిక చోట్ల ఎన్నుకోలేకపోతున్నాం. 'ఏ సమాజంలో అయితే నీతి తప్పిన వారు విజయం సాధిస్తారో, ఎక్కడైతే నేరస్తులు ఆరాధ్యులుగా మారతారో, ఎక్కడైతే విలువలు పతనమై అవకాశవాదం రాజ్యమేలుతుందో, అక్కడ వ్యవస్థకు సంబంధించిన 'పునఃసమీక్ష'కు సమయం ఆసన్నమైంది అని అర్థం' అంటారు ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్త రాబర్ట్ క్లిట్‌గార్డ్. ఈ క్రమంలో కార్పొరేట్- మతతత్వ పార్టీలు రేపుతున్న కుల, మత విద్వేషాలను తిప్పికొట్టాలి. ముఖ్యంగా పాలకులు చెప్పే మాయమాటలు, తప్పుడు మేనిఫెస్టోలను నమ్మి మంచిచెడ్డల విచక్షణ కోల్పోతున్నాం. ఫలితంగా... బడా కార్పొరేట్లు, నేరగాళ్లు, సెక్స్ స్కాండల్స్‌లో, ఆర్థిక కుంభకోణాల్లో ఇరుక్కున్న వారు చాలామంది పార్లమెంటు సభ్యులుగా ఎన్నికవుతున్నారు.

బిజెపి తిరిగి అధికారంలోకి వస్తే... ఈ దేశంలో ఇవే చివరి ఎన్నికలని సర్వత్రా వినిపిస్తున్న మాట. అదేగాని జరిగితే... రాజ్యాంగం, దాని మౌలిక స్వరూప స్వభావాలు, ప్రజాస్వామ్యం, స్వావలంబన, ఫెడరలిజం, సామాజిక న్యాయం వంటివి తీవ్ర ప్రమాదంలో పడతాయి. అసలు ఓటు వేసే అవకాశమే వుండకపోవచ్చు. ఎవరూ ప్రశ్నించడానికి వీలులేని నిరంకుశ ప్రభుత్వ ఏర్పాటుకు బిజెపి ప్రయత్నిస్తోంది. ఒక నిరంకుశ, కార్పొరేట్ పాలనను మతం ముసుగులో నెలకొల్పాలన్నదే దాని లక్ష్యం. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే భాష, ఒకే మతం, ఒకే ఎన్నిక అనే సూత్రాల్ని బిజెపి ప్రచారం చేస్తోంది. ఈ భావన రాష్ట్రాల అభివృద్ధికి, వికాసానికి ఆటంకం. భిన్న భాషలు, సంస్కృతులకు నిలయమైన దేశంలో భిన్నత్వంలో ఏకత్వం చాటి చెప్పాలి తప్ప వాటిని తొక్కిపెట్టి కాదు. గత పదేళ్ల పాలనలో చేదు అనుభవాలను చవిచూసిన తర్వాత మళ్లీ బిజెపికి, బిజెపిని బలపరిచే టిడిపి, జనసేన, వైసిపి లాంటి పార్టీలకు ఓటు వేస్తే జరిగే ముప్పు గురించి ఆలోచించాల్సిన సమయం ఇది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునే ఎన్నికలు మాత్రమే కాదు. ఇది దేశ భవిష్యత్తును, రాష్ట్ర భవితను నిర్ణయించే ఎన్నికలు. 'ఓటిచ్చినప్పుడే వుండాలె బుద్ధి/ ఎన్నుకొని తలబాదుకొన్న ఏమగును?/ తర్వాత ఏడ్చినను తప్ప దనుభవము' అంటారు కాళోజీ. కాబట్టి ఏ ఒక్క ఓటు కూడా వృధాకాకుండా ఓటు వెయ్యాలి. మన ఓటును సద్వినియోగం చేసుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని బలపర్చుకునే దిశగా దాన్ని వినియోగించాలి.

మహనీయుల మాట



వ్యక్తిగతంగా దేవునిపై నమ్మకం వున్నా మతాన్ని ఇతరులపై రుద్దే హక్కు లేదు.

- ఫ్లోరెన్స్ నైటింగేల్,

సంఘసేవకురాలు, నర్సు.

జననం : 12.5.1820

మరణం : 13.8.1910

Florence Nightingale

చారిత్రక తీర్పు దిశగా ఓటర్లు

ప్రస్తుతం



తెలకపల్లి రవి



> ఈ అయిదేళ్లలోనూ ఈ కృత్రిమ వ్యూహాలు పనిచేయవని తేలిపోయింది. మత రాజకీయాల ముప్పుపై మెళకువా పెరిగింది. లౌకిక ప్రతిపక్షాలను ఒకచోటికి చేర్చేందుకు గట్టి ప్రయత్నాలే జరిగాయి. అందుకే ఎ.పి లో వలె బిజెపికి దగ్గరగా వుండిన పక్షాలు కూడా ఆ అంశాన్ని కాస్త వెనక్కు నెట్టి ఇతర తరహాలో ప్రచారం చేసుకుంటున్నారు. ఎ.పి లో చంద్రబాబు, జగన్‌ల తీరే అందుకో ఉదాహరణ. చాలా చోట్ల బిజెపి వారిని జెండాలు లేకుండా రమ్మని కూడా టిడిపి పట్టు పట్టినట్టు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ఉభయులూ అవతలివారు బిజెపితో వున్నారని ఆరోపిస్తుంటారు. విధానాల పరంగా గాకున్నా మనుగడ కోసమైనా మతతత్వ రాజకీయాలతో తమకు సంబంధం లేదని చెప్పుకోవలసిన స్థితి. ఈ భావన పెరిగేకొద్ది మోడీ, అమిత్ షా మరింతగా ముస్లిం వ్యతిరేకత, విద్వేష ప్రచారం పెంచుతున్నారు. ఈ ధోరణులకు అంతిమంగా ప్రజలే తగు సమాధానమిస్తారని ఆశించాలి.

మే13 భారతీయుల, తెలుగు ప్రజల తీర్పు కొత్త చైతన్యానికి సంకేతం కాబోతున్నదా? ఇదే ప్రశ్న పరిశీలకులనూ చరిత్రకారులనూ ఆలోచింపచేస్తున్నది. మోడీ హ్యాట్రిక్ ఖాయమంటూ మొదలైన హంగామా ఆయన ట్రిక్కుల వేటతో రోజుకో మలుపు తిరుగుతున్నది. బహుశా ఏ ప్రధాన మంత్రి నుంచీ ఎన్నడూ వినని దారుణమైన, విద్వేష వాక్కులు మోడీ నోట వినవలసి వచ్చింది. మతాలపై పార్టీలపై కుటుంబాలపై, వ్యక్తులపై మోడీ విష ప్రచారాలు గతంలో ఎన్నడూ చూడనంత దిగువకు చేరాయి. తెలుగునాట ఆ మోడీతో ప్రత్యక్షంగా పరోక్షంగా జట్టుకట్టిన పార్టీలూ నేతలూ కూడా మింగలేక కక్కలేక తంటాలు పడుతున్న పరిస్థితి. అసలు సమస్యలతో నిమిత్తం లేని అసహన రాజకీయాలు అధికార ఆరాటాలు, కులాల కుటుంబాల కుమ్ములాటలుగా మారిన ఎ.పిలో శాసనసభ ఎన్నికలు కూడా జరుగుతున్నందున మే 13కు ముందస్తు రంగం మరింత తీవ్రంగా తయారైంది. వైసిపి వ్యతిరేక ఓటు చీలకూడదు గనక బిజెపిని మోయాల్సిందేనని షరతు పెట్టి జట్టుకట్టిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, స్కిల్ స్కామ్ అరెస్టు తర్వాత మోడీ అండ అనివార్యమని తలపోసిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వెంటపడి చివాట్లు తిని మరీ రాష్ట్ర ప్రయోజనాల పేర ఎ.పి లోకి ఎన్‌డిఎను తీసుకొచ్చారు. మరోవైపున వారిది పొత్తు అయితే ఈయన తొత్తు అనిపించుకున్న ఎ.పి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అంతే అనివార్యంగా బిజెపి వల్ల ముస్లిం రిజర్వేషన్లకూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి కలిగే ముప్పును గురించి మాట్లాడవలసి వచ్చింది. కాకపోతే ఆంధ్ర ప్రదేశ్‌కు బలమైన కమ్యూనిస్టు సంప్రదాయాలు, క్రియాశీల ఉద్యమం వున్నందువల్ల ఈ దాగుడు మూతలు దగాకోరు రాజకీయాలు పెద్దగా సాగింది లేదు. రెండే పక్షాలు ఇద్దరే నాయకులు అన్నట్టు జగన్ బాబు ప్లస్ పవన్ మధ్య సాగిన ప్రహసనంలో ప్రత్యేక హోదాతో సహా రాష్ట్ర సమస్యలు ప్రధాన ఎజెండాలోకి వచ్చాయి. కాంగ్రెస్‌కు కాస్త ఊపిరి వచ్చి 'ఇండియా' వేదిక ఇక్కడ కూడా పాత్ర వహించడంతో మూడు కూటముల పోరాటంగా మారింది. శుక్రవారం నాడు మూడు పార్టీల అగ్ర నాయకులు కలసి జరిపిన సభ ఇందుకు సంకేతమైంది. ఈ మధ్యలో పర్యటనలు, షోలు చేసిన మోడీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏ కొత్త, పాత హామీ ఇవ్వకుండా వ్యక్తిగతంగా జగన్ వ్యతిరేక వ్యాఖ్యలు చేయకుండా రాజకీయ విన్యాసం చేసి వెళ్లడంలో జాతీయంగా ఆయన దురవస్థ తెలుస్తుంది.

సెమీఫైనల్, ఫైనలా?

తెలంగాణకు వస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ ఎన్నికలు తన పాలనపై రెఫరెండమనీ, శాసనసభ ఎన్నికలు సెమీ ఫైనల్‌గా ఇదే ఫైనల్ అనీ ప్రకటించడంతో అక్కడా వేడి పెరిగింది. శాసనసభ ఎన్నికలనాడు కాంగ్రెస్, సిపిఐ మాత్రమే కలసి వుండగా ఇప్పుడు 'ఇండియా' వేదిక రంగంలోకి వచ్చింది. ఇందుకోసం ముఖ్యమంత్రితో సహా చర్చలు జరిపి మద్దతు కోరడం పరిస్థితిని ప్రతిబింబించింది. మూడు నెలల్లో అంతా తలకిందులై తామే తిరిగొస్తామన్న బిఆర్ఎస్ మనుగడ కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తుంటే తమకే ఎక్కువ సీట్లు వస్తాయని బిజెపి పసలేని హడావుడి చేస్తున్నది. ఎ.పి లో బిజెపి మతతత్వ రాజకీయాల వల్ల మైనార్టీలు దూరమై నష్టం జరుగుతుందనే ఆందోళన ఎన్‌డిఎలో వుంటే తెలంగాణలో మాధవీలత వంటి వారిని ముందు పెట్టి ఆ మతతత్వాన్నే రాజేయడానికి బిజెపి పాచికలు వేస్తున్నది. ప్రాంతీయ పార్టీల కలహాల స్థాయికి మారిన తెలుగు రాజకీయాలలో మరోసారి మతతత్వం, లౌకికతత్వం ఎజెండాను తెచ్చి 'ఇండియా' తాలూకు జాతీయ కోణాన్ని ఆవిష్కరించడంలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, ఇతర లౌకిక ప్రజాస్వామిక వాదుల పాత్ర కాదనలేనిది. చివరికి వచ్చే సరికి జగన్ బిజెపి, ఎన్‌డిఎ ముస్లిం రిజర్వేషన్లను వ్యతిరేకించడాన్ని సూటిగా ఖండించక తప్పలేదు. ఎన్నికల తర్వాత బిజెపి లోకి వెళతాడనే ఊహాగానాలను రేవంత్ కూడా ఏదో విధంగా తోసిపుచ్చకా తప్పలేదు.

సామాజిక సంకేతాలు

సామాజిక శక్తులుగా చూస్తే మోడీని మోసేందుకు సిద్ధమైన మందకృష్ణ వంటి వారి గొంతు వెనక్కు పోగా ఎ.పి లోనూ ఎన్‌డిఎ సోషల్ ఇంజనీరింగ్ వికటించి చాలా శక్తులు దూరమవడం కనిపిస్తుంది. వామపక్షాలు ఎప్పటి నుంచో చెబుతున్న లాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటివి కేంద్ర స్థానంలోకి రాగా దానిపై ఎన్‌డిఎ కపట నాటకం బహిర్గతం కావడం, వైసిపి కూడా అమలులోకి రాలేదని సమర్థించుకోవడం ఈ పరిణామాల పరంపరలోవే. ఎ.పి, తెలంగాణ ప్రజలు ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య, లౌకిక విలువలు కాపాడే తీర్పునిస్తారని ఎన్‌డిఎకూ వైసిపికి తగిన పాఠం నేర్పుతారని ఆశించవచ్చు. కేవలం సినిమా ఆకర్షణలు కులాల వారీ వ్యూహాలతో నెట్టుకు రావచ్చునుకున్న పవన్ కళ్యాణ్ వంటి వారు కూడా ఈ క్రమంలో స్వంత గెలుపుకోసం తంటాలు పడాల్సిన పరిస్థితి ఒకటైతే బిజెపితో మోడీతో అవకాశవాద మైత్రిని సమర్థించుకోలేక చంద్రబాబు విన్యాసాలు సాగిస్తున్న దశ. జగన్ నిరంకుశ పాలనతో పాటు మోడీ మరింత పెద్ద నియంతగా పేరు మోశారనీ, ముఖ్యమంత్రులనే జైలుపాలు చేశారని న్యూస్ లాండ్రీ విలేకరి ప్రశ్నలు వేస్తుంటే చంద్రబాబు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. 'వైనాట్ 175' జోరు తగ్గిన వైసీపీ ఎలాగోలా తాము గట్టెక్కుతామని ఆశపడుతుంటే జనం మెప్పు పొందని కూటమిని ఓటమి పాలు కాకుండా కాపాడు కోవడానికి చంద్రబాబు ఏటికి ఎదురీదుతున్నారు. దక్షిణ భారతంలో బిజెపికి మరింత చోటివ్వకూడదనే సంకల్పం ప్రజల్లో బలంగా కనిపిస్తుంది.

డీలా పడిన మోడీ

మరోసారి జాతీయ దృశ్యం చూస్తే మూడు దశల పోలింగ్ తర్వాత మోడీ టీం నిరుత్సాహం స్పష్టంగా కనిపిస్తుంది. మొన్నటి వరకూ అమెరికా పాలకవర్గాల దన్నుతో మోడీని విశ్వగురువుగా చిత్రించిన పాశ్చాత్య మీడియాలోనూ ఈ మార్పు గోచరిస్తుంది. ఇప్పుడు పెద్ద లోతుల్లోకి వెళ్లకపోయినా పైపై శీర్షికలు చూస్తే చాలు ఇది తెలిసిపోతుంది. 'మోడీ గాలి తగ్గిందా? ప్రజలు ఓటేయడానికే రాలేదెందుకు? ఇది మే 2న ఎకనామిక్ టైమ్స్ శీర్షిక. రాయిటర్స్ వార్తా సంస్థ అనేక చోట్ల అనేక మందిని కలిసి ఇచ్చిన ఈ కథనం చాలా పత్రికలు ప్రముఖంగా ప్రకటించాయి. మోడీ విభజనవాద ప్రసంగాలు ఎత్తుకోవడంతో ప్రశ్నలు తలెత్తుతున్నాయని బిబిసి వివరంగా కథనం ఇచ్చింది. అల్‌జజీరా, ఎకనామిస్ట్, గార్డియన్ ఇలా ఏ ప్రముఖ అంతర్జాతీయ పత్రిక కూడా బిజెపి ప్రభంజనం ఏదో వున్నట్టు కథనమివ్వలేదు. కాశ్మీర్‌పై మోడీ గొప్పల పస తేలిపోవడంతో అక్కడ ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదని కూడా రాయిటర్స్ తెలిపింది. తాను అధికారానికి రావడంలేదని అర్థమైనందుకే మోడీ సమతుల్యత లేకుండా మాట్లాడు తున్నారని శరద్ పవార్ వ్యాఖ్యానించడాన్ని ఫ్రంట్‌లైన్ ప్రముఖంగా ఇచ్చింది. సగం సీట్లకు ఓటింగు ముగిసినా బిజెపి ఇప్పటికీ ఎన్నికల ఎజెండాను రూపొందించలేకపోయిందని డెక్కన్ హెరాల్డ్ రాసింది. వెయ్యి కత్తి కోతలతో బిజెపి నరకయాతన పడుతున్నదని వైర్‌లో ప్రేమ్ ఫణిక్కర్ ఉదాహరణలతో సహా చెప్పారు. టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ గెలిచిన సూపర్ ప్లేయర్ తదుపరి సారి సెమీ ఫైనల్‌లోనే ఓడిపోయినట్లుగా బిజెపి తయారైందని వ్యాఖ్యానించారు. 2014 కన్నా 2019లో నాలుగు సీట్లు పెంచుకుని 303కు చేరుకున్న బిజెపి ఇప్పుడు తిరోముఖంగా తయారైందన్నారు. గతంలో కర్ణాటకలో 29 స్థానాలు వచ్చిన బిజెపి ముగిసిన మూడు దశల్లోనూ అంతకంతకూ దెబ్బ తినిపోవడమే గాక విద్వేష ప్రసంగాలు జె.డి.ఎస్ రేవణ్ణ అత్యాచారపర్వం వంటి వివాదాల్లో చిక్కుకుపోయింది. కనీసం 18 కోల్పోవడం ఖాయంగా కనిపిస్తుంది. మహారాష్ట్రలోనూ అదే పరిస్థితి. అజిత్ పవార్ ఏదో ఉద్ధరిస్తాడనుకుంటే బారామతిలో తన సీటు కోసమే పెనుగులాట!

మూలపీఠాల్లో ముసలం?

తూర్పు, దక్షిణ భాగాల్లో బిజెపికి వ్యతిరేకత బాగా తెలిసిందే. ఢిల్లీలోనూ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ బెయిల్‌పై రావడం బిజెపి వ్యూహాలకు ఎదురు దెబ్బ. రాజకీయంగానూ మారుతున్న పరిస్థితిని వెల్లడిస్తుంది. మహారాష్ట్రలో హత్యకు గురైన నరేంద్ర దభోల్కర్ హంతకులకు ఈ సమయంలోనే శిక్ష పడింది. ఇంకా కీలకమైనవి ఉత్తర ప్రదేశ్, గుజరాత్‌లు. వీటిలో అత్యధిక ఫలితాలే మోడీకి పట్టం కట్టాయి. కానీ ఇప్పుడు యు.పి కథ మారింది. 2014తో పోలిస్తే 2019లో యు.పి లో ఓట్లు పెరిగినా తొమ్మిది సీట్లు తగ్గాయి బిజెపికి. ఈసారి కాంగ్రెస్, సమాజ్ వాది పొత్తు ప్రభావం బలంగా వుందంటున్నారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ట లాభమేమీ లేదని నిట్టూర్పులు విడుస్తున్నారు. అసలు ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మధ్యలో వైరం చాలా సీట్లు పోగొడుతుందని సందేహాలున్నాయి. శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్‌కు జరిగిందే తమ పార్టీలో పునరావృతం అవుతుందని బిజెపి నేతలు భయపడుతున్నారు. క్షత్రియ వర్గాల అసంతృప్తి గుజరాత్ లోనూ దెబ్బ తీస్తుందని కలవరపడుతున్నారు. హర్యానా సర్కారు ఇప్పటికే మైనార్టీలో పడింది. బీహార్‌లో 'ఇండియా' వేదిక బలంగా సాగుతోంది. బెంగాల్లో సిపిఎం పుంజుకోవడంతో బిజెపి, దాని వ్యతిరేకులు అన్న రీతిలో ద్విముఖ సమరంలా మారిందని వ్యాఖ్యలు వస్తున్నాయి.

ముందున్న సవాలు

బిజెపి ఈ పరిస్థితికి రావడానికి 2024 ఎన్నికలు జరుగుతున్న నేపథ్యం కూడా ఒక కారణం. 2019లో ఉగ్రవాదుల దాడులు, పుల్వామా సర్జికల్ స్ట్రయిక్స్ వంటి వాటికి హైప్ ఇచ్చి ఓటర్లను ఉద్వేగంవైపు తిప్పారు. కానీ ఈ అయిదేళ్లలోనూ ఈ కృత్రిమ వ్యూహాలు పనిచేయవని తేలిపోయింది. మత రాజకీయాల ముప్పుపై మెళకువా పెరిగింది. లౌకిక ప్రతిపక్షాలను ఒకచోటికి చేర్చేందుకు గట్టి ప్రయత్నాలే జరిగాయి. అందుకే ఎ.పి లో వలె బిజెపికి దగ్గరగా వుండిన పక్షాలు కూడా ఆ అంశాన్ని కాస్త వెనక్కు నెట్టి ఇతర తరహాలో ప్రచారం చేసుకుంటున్నారు. ఎ.పి లో చంద్రబాబు, జగన్‌ల తీరే అందుకో ఉదాహరణ. చాలా చోట్ల బిజెపి వారిని జెండాలు లేకుండా రమ్మని కూడా టిడిపి పట్టు పట్టినట్టు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు ఉభయులూ అవతలివారు బిజెపితో వున్నారని ఆరోపిస్తుంటారు. విధానాల పరంగా గాకున్నా మనుగడ కోసమైనా మతతత్వ రాజకీయాలతో తమకు సంబంధం లేదని చెప్పుకోవలసిన స్థితి. ఈ భావన పెరిగేకొద్ది మోడీ, అమిత్ షా మరింతగా ముస్లిం వ్యతిరేకత, విద్వేష ప్రచారం పెంచుతున్నారు. ఈ ధోరణులకు అంతిమంగా ప్రజలే తగు సమాధానమిస్తారని ఆశించాలి. ఒక్కో దశ ముగుస్తుంటే ఓటింగు తగ్గుతున్నందున బిజెపి, ఎన్‌డిఎలు కూడా ఇంకా ఈ ధోరణి పెంచుతారనడంలో సందేహం లేదు. వాటిని అడ్డుకోవలసిన ఎన్నికల సంఘం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నది. కనుక ఓటర్లు అప్రమత్తంగా వుండక తప్పదు.

❖

బేతాళం - 4



వికసిత్ సింధియా!

పట్టువదలని విక్రమార్కుడు చెట్టుకు వేలాడుతున్న శవాన్ని దించి, తన భుజాన వేసుకున్నాడు. స్మశానం వైపు వేగంగా నడవ సాగాడు. కొంత దూరం వచ్చేవరకూ మౌనంగా వున్న బేతాళుడు...కూనిరాగాలు తీయడం మొదలెట్టాడు. 'ఇదేమిటి? రోజూ ప్రశ్నలతో వేధించే బేతాళుడు కొత్తగా కూనిరాగాలు తీస్తున్నాడు' అనుకున్నాడు విక్రమార్కుడు. అయినా, ఈ బేతాళుడ్ని కదిలించిన దగ్గర నుంచి ఏదోక కథ చెప్తానంటాడు. ఎందుకొచ్చిన గోల... అనుకున్నాడు మనసులో.

విక్రమార్కుడి ఆలోచనలు పసిగట్టిన బేతాళుడు... 'రాజా! నువ్వేం ఆలోచిస్తున్నావో నాకు తెలుసు...' అంటూనే ఈసారి పైకే పాడటం మొదలు పెట్టాడు. 'వేషము మార్చెను/ భాషను మార్చెను/ మోసము నేర్చెను/ అసలు తానే మారెను/ అయినా..మనిషి మారలేదు/ ఆతని మమత తీరలేదు'...లలలల...ఆఆఆ అంటూ రాగం తీస్తున్నాడు కర్ణకఠోరంగా. ఒకసారి విక్రమార్కుడి వైపు చూసి...'దేశమంటే మట్టికాదోయ్...దేశమంటే మనుషులోయ్' అంటూ మరో రాగం అందుకున్నాడు.

బేతాళుడి పాట వినడం చాలా దుర్భరంగా అనిపించింది విక్రమార్కుడికి. అతనికి ఆటంకం కలిగిస్తే...మళ్లీ చెట్టెక్కి కూర్చుంటాడేమోనన్న భయంతో...తన అసహనాన్ని మనసులోనే దాచుకొని..చిరాగ్గా శవంవైపు చూస్తూ మౌనంగా నడవసాగాడు. 'రాజా, నీ అసహనం నాకర్థమైంది. నిజానికి నీ శ్రమ, దీక్ష చూస్తుంటే నాకెంతో ముచ్చటగా వుంది. అందుకే... నీకు అలసట తెలియకుండా వుండేందుకు 'వికసిత్ సింధియా' అనే కథ చెప్తా...జాగ్రత్తగా విను' అంటూ మొదలు పెట్టాడు.

'సింధియా అనే దేశానికి కాషాయం పార్టీకి చెందిన జేడీ అధినేతగా వున్నాడు. పదేళ్ల పాలనలో జేడీ ఒక్క వాగ్దానం కూడా నెరవేర్చలేదు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అంటూ దేశ్ కా సత్యానాశ్ చేశాడు. వికసిత సింధియా అంటూ...దేశాన్ని విఫల సింధియాగా మార్చాడు. ఆయనిచ్చిన 150 హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదు. అచ్చే దిన్ అన్నాడు...కానీ సచ్చేదిన్ వచ్చిందని ప్రజలు వాపోతున్నారు ప్రతిపక్షాలు గట్టిగా మాట్లాడితే... పాకిస్తాన్, పుల్వామా అంటూ ఎమోషనల్ డ్రామాతో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. 'సొంత లాభం కొంత మానుకు, పొరుగువాడికి తోడుపడవోయి/ దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' పెద్దపెద్ద కవులు రాసిన కవితల్లోని వాక్యాలను బట్టీ పట్టి... అవసరాన్ని బట్టి వల్లెవేస్తుంటాడు. రాజా...వికసిత్ సింధియా అంటే ఏమిటి? నిజంగానే సింధియా వికసించిందంటారా? జేడీ గొప్పలకు అర్థముందా?' ఇంతకీ నిజమేంటి? నువ్వేమనుకుంటున్నావు?' నిజం చెప్పు. నీకు తెలిసి కూడా చెప్పకపోయావో నీ తల వెయ్యి ముక్కలవుతుంది' అన్నాడు బేతాళుడు.

చెప్పకపోతే వీడెలాగూ వదిలి పెట్టడు అనుకున్న విక్రమారుడు...'ఇందులో చెప్పడానికేముంది. తెలుగునాడుకు వచ్చినప్పుడల్లా గురజాడ వారి 'దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్' అని చెబుతుంటాడు. వాస్తవానికి జేడీ చెప్పే వికసిత్‌లోని వికాసం సింధియా మనుషుల్లో వుండాలి. నిజానికి దానికి విరుద్ధంగా జరుగుతోంది. నిరుద్యోగం పెరిగింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రజలు అప్పుల్లో కూరుకుపోతున్నారు. మరి వికసిత్ ఎవరికి అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. నాకు తెలిసి...అబానీకి, అందానికి, జేడీకి మాత్రమే వికసిత్ గానీ, ప్రజలకు కాదు. అందుకే ఆ దేశంలోని సోషల్ మీడియాలో వికసిత్ అందానీ, వికసిత్ అబానీ అంటూ పోస్టులు పెడుతున్నారు' అని బదులిచ్చాడు విక్రమార్కుడు.

'రాజా...నువ్వు చెప్పింది కరెక్టే. ఇప్పుడు జేడీ వికసిస్తాడో లేదో చూద్దాం...అంతవరకు సెలవు' అంటూ విక్రమార్కుడి భుజమ్మీద నుంచి మాయమై మళ్ళీ చెట్టెక్కాడు బేతాళుడు.

- రాజాబాబు కంచర్ల

9490099231

బాధ్యతల్లో విఫలమైన ఇ.సి

వ్యాఖ్య

లోక్‌సభ ఎన్నికల మూడో దశ పోలింగ్ మే ఏడవ తేదీన పూర్తవడంతో సగం లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగినట్టయింది. స్వేచ్ఛగా న్యాయంగా ఎన్నికలు నిర్వహించడంలో, పర్యవేక్షించడంలో ఎన్నికల సంఘం (ఇ.సి) ఏ మేరకు పని చేయగలిగిందని అంచనా వేసేందుకు ఒక అవకాశం లభించినట్టయింది. అందుకు అవసరమైన అనుభవం సమకూరింది. ఈ విధమైన మదింపు వేసినప్పుడు ఇవ్వగలిగే తీర్పు ఒక్కటే. ఎన్నికల సంఘం దారుణంగా విఫలమైంది. ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు కేవలం మూడు రోజుల ముందు నియమితులైన ఇద్దరు కమిషనర్లను కలిగిన ఎన్నికల సంఘం పని గురించి వ్యక్తమైన భయాలన్నీ నిజమైనాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని (ఎంసిసి అమలు చేయడమనే ప్రాథమిక బాధ్యతను) కూడా ఇ.సి నిర్వహించలేదు. అన్ని పార్టీలకు సమాన అవకాశాలు కలిగించలేకపోయింది. మార్చి 16న ఎన్నికల ప్రక్రియ ప్రకటించిన నాటి నుంచి ఎంసిసిని అమలు పర్చగలిగామని ఇసి ఆత్మసంతృప్తితో కూడిన ప్రకటన చేసింది. కానీ వాస్తవానికి ఈ కాలంలో ఇసి తన బాధ్యతల నుంచి కాడి పారేసింది. మొదటి విషయం ప్రతిపక్షాలతో రాజ్య ప్రేరిత నిర్బంధం సాగుతుంటే ఇ.సి నిశ్శబ్ద ప్రేక్షక పాత్రకే పరిమితమైంది. ఎన్నికల ప్రకటన, కోడ్ అమలులోకి వచ్చిన అయిదు రోజుల తర్వాత మార్చి 21న ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు జరిగింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులపై ఎలాంటి బలప్రయోగ చర్యలకు పాల్పడవద్దని ఇ.సి అన్ని కేంద్ర ఏజన్సీలకు సూచన చేసి వుండవలసింది. కానీ అలా జరగలేదు. అలాగే ఆదాయ పన్ను శాఖ తొలుత కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలు స్తంభింపచేసింది. ఆ తర్వాత త్రిచూర్ జిల్లా సిపిఎం బ్యాంకు ఖాతాను కూడా స్తంభింపచేసింది. ఇది ఎన్నికల తరుణంలో సంబంధిత పార్టీలకు నిధులు లేకుండా బిగించేందుకు ఉద్దేశించిన చర్య మాత్రమే.



విద్వేష ప్రచారాలకు యథేచ్ఛ

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పచ్చి మతతత్వ ధోరణిలో చేసిన ప్రసంగాలపై చర్య తీసుకోవడానికి ఇ.సి నిరాకరించింది. ఎంసిసి అమలులో లొసుగులకు ఇంతకన్నా బలమైన నిదర్శనం అక్కరలేదు. ప్రతిపక్షాలు రామచంద్ర మూర్తికి వ్యతిరేకంగా వున్నాయని, అవమానించేవిగా వున్నాయని ఆయన ఆరోపించారు. రామమందిరంపై విద్వేషం పెంచుకుంటు న్నాయని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఏప్రిల్ ఆరున అజ్మీర్ లోనూ, 9న ఫిలిబిత్‌లోనూ మోడీ చేసిన ప్రసంగాలపై సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత దశలో ముస్లింలను భూతాల్లా చిత్రిస్తూ ఏప్రిల్ 21న బాన్స్‌వారాలో మూఢత్వ ప్రసంగం చేశారు. దీనిపైనా ఆందోళన చెందిన పౌరులు, వివిధ పార్టీలు ఫిర్యాదులు చేశాయి. ఈ విధంగా ప్రసంగించిన వారిపై చర్య తీసుకునేందుకు ఇ.సి సిద్ధం కాలేదు. అందుకు మారుగా బిజెపి అధ్యక్షుడైన జె.పి నడ్డాకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాలు గడిచిపోయినా ఇప్పటివరకూ బిజెపి అధ్యక్షుడి నుంచి కూడా ఎలాంటి స్పందన రాలేదు. కేవలం మరింత గడువు కావాలని మాత్రమే ఆయన కోరారు. మరోవైపున మోడీ మతపరమైన ఇతివృత్తాలతో నిరంతరాయంగా రెచ్చిపోతున్నారు. ప్రతి పక్షాలపై ఉద్రేకాలు రెచ్చగొట్టే ప్రసంగాల పరంపరగా సాగిస్తున్నారు. తాజా ఉదాహరణ చెప్పాలంటే కర్ణాటక బిజెపి అధ్యక్షుడు ముస్లింలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వీడియోలు ఎక్స్ ప్లాట్‌ఫాంలో పోస్టు చేశారు. దానిపై ఫిర్యాదులు వచ్చాక ఎన్నికల కమిషన్ ఎక్స్ ప్లాట్‌ఫాంను ఆ వీడియోలు తొలగించాలని ఆదేశించింది. అయితే కర్ణాటక ఎన్నికల చివరి దశ పూర్తయిన తర్వాత గాని ఆ మేరకు ఆదేశాలు జారీ కాలేదు. ఇప్పటికీ వాటిని తొలగించిందీ లేదు. వ్యక్తిగతంగా అభ్యర్థులపై దాడులు, తప్పుడు ఆరోపణలు వంటి వాటి విషయంలో మాత్రం ఎన్నికల కమిషన్ వెంటనే చర్య తీసుకుంటున్నట్టు కనిపిస్తుంది. కానీ విద్వేష ప్రసంగాలు, మత విభజనను పెంచేందుకోసం సాగుతున్న హిందూత్వ ప్రచారాల విషయంలో మాత్రం ఎలాంటి చర్య తీసుకోవాలనుకోవడం లేదనిపిస్తుంది.

సమర్థత, సాంకేతికత మాయం

కమిషన్ సమర్థతలోనూ సాంకేతిక పాటవంలోనూ క్షీణత కొట్లవచ్చినట్టు కనిపిస్తుంది. ఒక దశాబ్దం కిందటి వరకూ ఎన్నికల కమిషన్ పోలింగ్ నిర్వహణలోనూ యంత్రాంగ సంబంధమైన చర్యలలోనూ చక్కగా పని చేసిన దాఖలాలున్నాయి. అలాగే గణాంకాలు కూడా వెంటవెంటనే కూర్పు జరిగేది. కాని గత కొన్ని సంవత్సరాలలోనూ నికరమైన ఈ గత ప్రతిష్ట హరించుకుపోతున్నది. 2019 ఎన్నికల తర్వాత పోలింగుకు సంబంధించి రాష్ట్రాల వారీగానూ దేశ వ్యాపితంగానూ కచ్చితమైన తుది గణాంకాల ప్రకటనకు రెండేళ్లు పట్టింది. ఇప్పుడు కూడా పోలింగ్ మొదటి దశ పోలింగ్ తుది గణాంకాల ప్రకటన రెండవ దశ తర్వాత నాలుగు రోజులకు గాని జరగలేదు. రెండవ దశ పోలింగ్ శాతం తుది వివరాలు కూడా నాలుగు రోజులు ఆలస్యంగా ప్రకటితమైనాయి. దాదాపు ఆరు శాతం పెరుగుదల వున్నట్టు వెల్లడించారు. అసాధారణమైన ఈ పెరుగుదలకు కారణమేంటో ఎన్నికల సంఘం వివరణ కూడా ఇచ్చింది లేదు. పైగా నియోజకవర్గాలలో గాని అఖిల భారత స్థాయిలో గాని పోలైన ఓట్ల సంఖ్య ఎంతో చెప్పలేదు. ఈ సంఖ్యలు కచ్చితంగా ఎన్నికల కమిషన్‌కు అందుబాటులో వుండి వుండాలి. అవి వుంటేనే శాతం లెక్క కట్టడం సాధ్యపడుతుంది. ఒకవేళ ఏదైనా తేడా వస్తే ఈ సంఖ్యలతో సరిపోల్చవలసి వుంటుంది. ఈ డేటా ఇవ్వలేకపోవడానికి ఎలాంటి కారణాన్ని కమిషన్ వివరణ ఇవ్వడం లేదు

సుప్రీం కోర్టు చేయాల్సింది

అధికార వర్గం లేదా పాలక పార్టీ ఒత్తిళ్లను తట్టుకోలేని, దుర్బలమైన ఎన్నికల కమిషన్ 'ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ, నిర్దేశం, నియంత్రణ' అనే తన తన రాజ్యాంగ బాధ్యతలను ఎన్నటికీ నిర్వహించజాలదు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కమిషనర్‌గా పని చేసిన అశోక్ లావాసా విషయంలో జరిగినదాని నీడలు ప్రస్తుత కమిషనర్లను వెంటాడుతుండాలి. ఇ.సి అనేది న్యాయమైన స్వేచ్ఛాయుత ఎన్నికలకు భద్రత కల్పించాల్సిన ఒక బృహత్తర కీలక వ్యవస్థ. ఈ ఎన్నికల తర్వాతనైనా కమిషన్ స్వతంత్రతను, సమగ్రతను పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవలసి వుంటుంది. మోడీ ప్రభుత్వం 2023లో తెచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని సవరించడం ఆ దిశలో తొలి అడుగవాలి. ఇందుకు ఒక భిన్న ప్రక్రియ అవసరమని సూచించిన సుప్రీం కోర్టు ఈ విషయంలో కాలూని ఆ పని జరిగేలా చూడాల్సి వుంటుంది.

(మే8 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

మోడీ సహా బిజెపి నేతలపై చర్యలేవీ ?

- ఇసి నిష్క్రియాపరత్వంపై రేగిన నిరసనలు
- దేశవ్యాప్తంగా ప్రచారాలు
- ఇసికి ప్రముఖులు, పౌర సమాజ సంస్థల లేఖ

బెంగళూరు : ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా, విద్వేష ప్రసంగాలు కొనసాగుతున్నా ఎన్నికల కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా 'గ్రో ఎ స్పైన్ ఆర్ రిజైన్' (వెన్నుచూపకుండా నిలబడు..లేదా రాజీనామా చేసి వైదొలుగు) నినాదంతో పౌర సమాజ సంస్థలు సంయుక్త ప్రచారాన్ని చేపట్టాయి. నిరసనలు తెలియచేశాయి. 96 గంటల పాటు ప్రచారం నిర్వహించకుండా ప్రధాని నరేంద్ర మోడీని నిషేధించాలని, ఆయనపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశాయి. కర్ణాటకలో సివిల్ సొసైటీ కార్యకర్తలు రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి (సిఇఒ) కార్యాలయానికి వెళ్లి మెమోరాండం అందచేశారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌ను, చట్టాలను ఉల్లంఘిస్తున్నా ఏమీ పట్టనట్లుగా, నిష్క్రియాపరంగా వ్యవహరిస్తున్నందుకు భారత ఎన్నికల కమిషన్‌ను జవాబుదారీ చేయాలని వారు కోరారు. కర్ణాటకలో, ముస్లిం రిజర్వేషన్‌పై బిజెపి యానిమేటెడ్ వీడియో క్లిప్ గురించి తాము సిఇఒకు ఫిర్యాదు చేశామని బహుత్వ కర్ణాటక సభ్యుడు వినయ్ శ్రీనివాస చెప్పారు. తక్షణమే ఈ వీడియోను తొలగించాలని డిమాండ్ చేశామన్నారు. ఎఫ్ఐఆర్ నమోదైనా, కర్ణాటకలో ఎన్నికలు ముగిసిన తర్వాత మాత్రమే ఆ వీడియోను తొలగించారన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పలువురు బిజెపి నేతలు అనేకసార్లు విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని, వాటిని ఇసి పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఇలాంటివేవీ పోస్టు చేయకుండా బిజెపి కర్ణాటక హ్యాండిల్‌ను నిలువరించాలన్నారు. కానీ తాము చేసిన డిమాండ్లలో ఏ ఒక్కదాన్ని కూడా పట్టించుకోలేదని వినయ్ పేర్కొన్నారు. కేవలం ప్రతిపక్షాలు పాల్పడిన కోడ్ ఉల్లంఘనల గురించి మాత్రమే ఇసి పట్టించుకుంటోందని ఆయన విమర్శించారు. పాలక పార్టీని స్వేచ్ఛగా వదిలివేసిందన్నారు. కోడ్‌ను ఉల్లంఘించినందుకు కాంగ్రెస్‌కి చెందిన రణదీప్ సూర్జేవాలా, బిఆర్ఎస్‌కి చెందిన కెసిఆర్‌లను 48గంటల పాటు ప్రచారం చేయరాదని నిషేధించిందని గుర్తు చేశారు. కానీ బిజెపి అంతకన్నా ఎక్కువే ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

సంయుక్త ఫిర్యాదు, పోస్టుకార్డుల ఉద్యమం


అహ్మదాబాద్, ముంబయి, హైదరాబాద్ తదితర నగరాల్లో చీఫ్ ఎన్నికల అధికారి కార్యాలయాలకు వెళ్ళి సంయుక్త ఫిర్యాదులు అందచేశారు. ఢిల్లీ చీఫ్ ఎన్నికల కమిషనర్ కార్యాలయానికి వెళ్ళి లేఖ కూడా అందచేశారు. పౌర సమాజ సంస్థలు ఈ విధంగా సమిష్టిగా ఆందోళన చేపట్టగా, పౌరులు పోస్ట్ కార్డ్ ఉద్యమం చేపట్టారు. వెన్నెముక బొమ్మతో వివిధ నగరాల నుండి ఇసికి వందలాది పోస్టుకార్డులను పంపారు.



బెంగళూరులో రాష్ట్ర చీఫ్ ఎన్నికల అధికారి కార్యాలయం వద్ద రాజ్యాంగం చేతబట్టి ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పోలింగ్ శాతాన్ని కేవలం శాతాల్లోనే చెప్పారు కానీ పోలైన ఓట్లను వెల్లడించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఓట్ల లెక్కింపులో అవకతవకలు పాల్పడే అవకాశాలు వున్నాయనే ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య చాలా వ్యత్యాసాలు వున్నట్లు వార్తలు వచ్చాయి. 373 నియోజకవర్గాల్లో ఈ పరిస్థితి కనిపించింది. కాంచీపురంలో 18 వేలు, శ్రీపెరంబదూర్‌లో 14512 ఓట్లు తేడా వచ్చాయి. కానీ ఇసి ఇంతవరకు ఆ తేడాకు వివరణ ఇవ్వలేదని ఆ లేఖ పేర్కొంది. ఈసారి కూడా పోలైన ఓట్ల డేటాను ప్రచురించడానికి నిరాకరిస్తోంది. దీనివల్ల ఓట్ల లెక్కింపులో అవకతవకలకు దారి తీస్తాయన్న ఆందోలను తలెత్తుతున్నాయి లేఖ పేర్కొంది. ఈ లేఖపై పలు పౌర సమాజ సంస్థలు, సంఘాలతోపాటూ లాయర్లు, కార్యకర్తలు, చిత్ర నిర్మాతలు, విద్యావేత్తలు, పౌరులు ఇలా వివిధ రంగాలకు చెందిన 222 మంది సంతకాలు చేశారు.

దభోల్కర్ కేసులో తీర్పుపై సిపిఎం అసంతృప్తి



ముంబయి : ప్రముఖ హేతువాది డాక్టర్ నరేంద్ర దభోల్కర్ హత్య కేసులో తీర్పు అసంపూర్ణమైనదని, ఏమాత్రం సంతృప్తికరంగా లేదని సిపిఎం మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ నర్కర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూఢ నమ్మకాల అవిశ్రాంతంగా పోరాడిన యోధుడు దభోల్కర్‌ను కాల్చి చంపిన ఇద్దరు దుండగులు సచిన్ అందూరే మరియు శరద్ కలస్కర్‌లకు పూణేలోని ప్రత్యేక కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఈ నెల 10న తీర్పు వెలువరించింది. ఈ మేరకు తీర్పును సిపిఎం అభినందించింది. అయితే ఇదే కేసులో కీలక సూత్రధారులైన మరో ముగ్గురు నిందితులు వీరేంద్ర తవాడే, అడ్వకేట్ సంజీవ్ పునలేకర్, విక్రమ్ భావే నేరాన్ని నిరూపించడంలో కోర్టులో ప్రాసిక్యూషన్ విఫలం కావడంపై సిపిఎం అసంతప్తిని వ్యక్తం చేసింది. పర్యవసానంగా, శాస్త్రీయత కోసం పరితపించిన యోధుడిని దారుణంగా హత్య చేసిన కేసులో ప్రాసిక్యూషన్ వైఫల్యం కారణంగా ముగ్గురు దుండగులు నిర్దోషులుగా విడుదలయ్యారని ఆందోళన వ్యక్తం చేసింది. సరైన సాక్ష్యాధారులు సేకరించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని, దీంతో సనాతన్ సంస్థ యొక్క ముగ్గురు దుండగులు శిక్ష నుంచి తప్పించుకున్నారని తెలిపింది. మొదట్లో మహారాష్ట్ర పోలీసులు, ఆ తర్వాత సిబిఐ దశాబ్ద కాలం పాటు విచారణను సాగదీసి..చివరకు ఈ దారుణమైన నేరానికి సూత్రధారులను పట్టుకోవడంలో ఘోర వైఫల్యం చెందాయని సిపిఎం పేర్కొంది.

కర్ణాటకలో మరో కీచక నేత

- లైంగిక వేధింపుల కేసులో బిజెపి నాయకుడి అరెస్ట్

న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల కేసులో జెడి(ఎస్) బహిష్కృత నేత, హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం ఇప్పటికే కర్నాటకను వణికిస్తున్నది. బిజెపి మిత్రపక్షమైన జెడి(ఎస్) నాయకుడి దారుణ చర్యలు బయటికి వచ్చిన కొన్ని రోజులకే.. బిజెపికి చెందిన నాయకుడు లైంగిక వేధింపుల కేసులో అరెస్టు కావటం గమనార్హం. న్యాయవాది కూడా అయిన జి దేవరాజే గౌడను లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి కర్నాటకలోని చిత్రదుర్గ జిల్లాలో శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. ప్రజ్వల్ రేవణ్ణ అనేక మంది మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు చూపుతున్న అనేక వీడియోలు తన వద్ద ఉన్నాయని గౌడ గతంలో చెప్పాడు. ప్రజ్వల్ రేవణ్ణను ఎన్నికల్లో పోటీకి దించకుండా పార్టీని హెచ్చరిస్తూ డిసెంబర్ 8న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్రకు లేఖ రాసినట్టు కూడా సమాచారం. అయితే, ప్రజ్వల్ రేవణ్ణ స్వయంగా రికార్డ్ చేసిన వీడియోలు ఏప్రిల్ 26న వెలుగులోకి వచ్చిన తర్వాత, వాటిని కాంగ్రెస్ లీక్ చేసిందని గౌడ వివరించారు. గతనెలలో హాసన్ జిల్లాలోని హెూలెనర్సిపూర్ పట్టణంలో గోవధపై ఒక మహిళ ఫిర్యాదు చేసింది. చట్టపరమైన విషయంలో తనకు సహాయం చేస్తానని హామీ ఇచ్చి, తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధిత మహిళ ఆరోపించింది. దీంతో పోలీసులు బిజెపి నేతకు నోటీసులు జారీ చేశారు. మహిళ ఫిర్యాదు మేరకు గౌడను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హెూలెనర్సీపూర్ నుంచి బిజెపి గౌడను పోటీకి దింపింది. అయితే, ప్రజ్వల్ రేవణ్ణ తండ్రి, రాష్ట్ర మాజీ మంత్రి, జెడి(ఎస్) ఎమ్మెల్యే హెచ్.డి రేవణ్ణ చేతిలో ఆయన ఓడిపోయారు.

3డీ ప్రింటెడ్ రాకెట్ ఇంజన్‌ను పరీక్షించిన ఇస్రో

చెన్నై : అంతరిక్ష రంగంలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటుతున్న ఇస్రో మరో విజయం అందుకుంది. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీతో రూపొందించిన పీఎస్4 రాకెట్ ఇంజెన్‌ను శుక్రవారం విజయవంతంగా పరీక్షించింది. హాట్ టెస్టింగ్ పేరిట జరిగిన ఈ పరీక్షలో ఇస్రో పీఎస్4 ఇంజెన్‌ను 664 సెకెన్ల పాటు మండించింది. ఏఎమ్ టెక్నాలజీతో (3డీ ప్రింటింగ్) ఈ ఇంజెన్‌ను తయారీ చేసినట్టు పేర్కొంది. ఈ సాంకేతికతతో ముడిసరుకులో 97 శాతం, ఉత్పత్తి సమయంలో 60 శాతం ఆదా అవుతుందని పేర్కొంది. ద్రవ ఇంధన ఆధారిత పీఎస్4ను పీఎస్ఎల్‌వీ రాకెట్ చివరి దశలో వినియోగిస్తారు. త్వరలో దీన్ని పీఎస్ఎల్‌వీ రాకెట్లలో వినియోగించనున్నారు. ఇంజిన్‌ను భారతీయ సంస్థ విప్రో 3డీ తయారు చేయగా తమిళనాడులోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో విజయవంతంగా పరీక్షించారు.

తూర్పు రఫాపై బాంబుల వర్షం

- సెంట్రల్ రఫాను ఖాళీ చేయాలంటూ తాజాగా హుకుం
- ఉత్తర గాజాలో పెరుగుతున్న ప్రతిఘటన

రఫా: ఐక్యరాజ్యసమితి హెచ్చరికలను బేఖాతరు చేస్తూ గత వారం రోజులుగా రఫాపై నాన్‌స్టాప్‌గా బాంబు దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ శనివారం వీటిని మరింత తీవ్రతరం చేసింది. తూర్పు రఫానుంచి ఇప్పటికే లక్ష మందికిపైగా ఆకలితో అలమటిస్తున్న ప్రజలను బలవంతంగా తరిమేసిన ఇజ్రాయిల్, తాజాగా సెంట్రల్ రఫా ప్రజలపై పడింది. వారిని వెంటనే అక్కడి నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని కరపత్రాలు, సోషల్ మీడియా ద్వారా హుకుం జారీ చేసింది. చికాగో జనసాంద్రత కన్నా నాలుగు రెట్లు అధికంగా ఉండే ఈ ప్రాంతంలో ఉత్తర గాజాలో దాడుల సందర్భంగా అక్కడి నుంచి తరలివచ్చిన 15 లక్షల మంది తలదాచుకుంటున్నారు. వీరిలో 6 లక్షల మంది దాకా పిల్లలు ఉన్నారు. నీరు, ఆహారం, కరెంటు వంటి కనీస వసతులు లేని గుడారాల్లో ఎలాగో ఒకలా బతుకీడ్చుతున్న వీరిని అక్కడ నుంచి కూడా నిర్దాక్షిణ్యంగా తరిమేస్తున్నారు. దీంతో వారు గాడిదలపైన, రిక్షాలపైన ఇంటి సామగ్రిని వేసుకుని కాలినడకన వెళుతున్న హృదయవిదారక దృశ్యాలు ఇప్పుడక్కడ సర్వసాధారణంగా కనిపించే దృశ్యాలు. వీరు స్వచ్ఛమైన గాలి, నీరుకు నోచుకుని ఎన్నాళ్లయిందో! ప్రపంచంలో ఆకలితో అలమటిస్తున్న జనాభాలో 80 శాతం మంది గాజాలోనే ఉన్నారంటే పరిస్థితి తీవ్రత ఏమిటో అర్థం చేసుకోవచ్చు. రోజూ 30 వేల మంది ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని బతుకు జీవుడా అంటూ ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నట్టు ఐరాస సహాయక సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) తెలిపింది.


ఇజ్రాయిల్ దాడిలో ధ్వంసమైన శిథిలాల వద్ద కూర్చున్న క్షతగాత్ర బాలుడు

ఇదిలా వుండగా ఉత్తర గాజాలో హమాస్ తన శక్తినంతటినీ కూడదీసుకుని శత్రు బలగాలపై ఎదురు దాడులు చేయనారంభించింది. ఇజ్రాయిల్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని రాకెట్ దాడులకు దిగింది. కరెం అబూ షలేమ్ క్రాసింగ్ వద్ద హమాస్ జరిపిన మోర్టార్ల దాడులు ఇజ్రాయిల్ సైన్యానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రఫాలో విజయం అంత తేలికేమీ కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది.

దాడికి వ్యతిరేకంగా యెమెన్‌లో భారీ ర్యాలీ

రఫాలో ఇజ్రాయిల్ దాడులను వ్యతిరేకిస్తూ యెమెన్ రాజధాని సనాతో సహా అన్ని ముఖ్యమైన నగరాల్లోను శుక్రవారం భారీ ర్యాలీలు జరిగాయి. గాజాలో పాలస్తీనీయులు విజయం సాధించేంతవరకు వారికి తమ పూర్తి మద్దతు ఉంటుందని నిరసనకారులు తెలిపారు. ఎర్ర సముద్రంలో ఇజ్రాయిల్ ప్రయోజనాలకు వ్యతిరేకంగా నాల్గవ దశ సైనిక కార్యకలాపాలను చేపడతామని చెప్పారు.

అమెరికాలో 3వేల మంది విద్యార్థుల అరెస్టు

గాజాకు సంఘీభావంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యూనివర్సిటీ విద్యార్థులపై బైడెన్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని కొనసాగిస్తోంది. ఇప్పటివరకు 3వేల మందిని అరెస్టు చేసినట్లు ఎపి వార్తా సంస్థ తెలిపింది. కొలంబియా, మాసాచుసెట్స్ ఇనిస్టిట్యూట ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటి), కేంబ్రిడ్జి, హార్వర్డ్, కాలిఫోర్నియా విశ్వవిద్యాలయాల్లో ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై సస్పెన్షన్ వేటు వేయడం, డిగ్రీలు ఇవ్వకుండా నిలిపివేయడం, హాస్టల్స్ నుంచి వెళ్లగొట్టడం, యూనివర్సిటీ నుంచి బహిష్కరించడం వంటి చర్యలకు యాజమాన్యాలు పాల్పడుతున్నాయి. అయినా, విద్యార్థులు లెక్క చేయకుండా తమ పోరాటాన్ని క్యాంపస్‌ల నుండి వీధుల్లోకి తీసుకెళ్తున్నారు.

వచ్చేది 'ఇండియా' ప్రభుత్వమే!

మొదటిపేజి తరువాయి

75వ యేట అడుగుపెడతారు. 75 ఏళ్లు వచ్చిన నాయకులు రాజకీయాల నుంచి తప్పుకోవాలంటూ బిజెపిలో ఓ నియమం ఉంది. ఆ ప్రకారం వచ్చే ఏడాది సెప్టెంబర్ 17తో మోడీ రాజకీయాల నుంచి రిటైర్ అవుతారు. అటువంటప్పుడు ఎన్డీఏయే ప్రధాని అభ్యర్థి ఎవరో ప్రకటించాలని కేజ్రీవాల్ సవాల్ విసిరారు.

భారీగా తరలివచ్చిన జనం

కేజ్రీవాల్, భగవంత్ మాన్ ఓపెన్ టాప్ వాహనంలో రోడ్లకిరువైపులా నిలిచిన ప్రజలకు అభివాదం చేస్తూ, వారిని పలకరిస్తూ ముందుకు సాగారు. కేజ్రీవాల్ ప్రసంగం వినేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పార్టీ నేతలు, కార్యకర్తల హర్షాతిరేకాలతో ఢిల్లీ వీధులు మార్మోగాయి. ఆప్ వలంటీర్లు పార్టీ పతాకాలు చేబూని, నినాదాలు చేస్తూ వాహనాన్ని అనుసరించారు. పార్టీ అభ్యర్థి సాహి రామ్ పహల్వాన్‌కు మద్దతుగా దక్షిణ ఢిల్లీలోని మెహ్రౌలిలో ఇరుకు వీధుల గుండా రోడ్ షో సాగింది. "జైలు నుండి విడుదలైన వెంటనే తిన్నగా మీ దగ్గరకే వచ్చాను. ఢిల్లీ ప్రజలను చాలా మిస్సయ్యాను. నా కోసం ప్రార్థించిన కోట్లాదిమంది ప్రజలకు కృతజ్ఞతలు చెప్పుకోవాలనుకుంటున్నాను." అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తన భార్య సునీత, పంజాబ్ సిఎం మాన్, తన మంత్రులు అందరూ తనను కలుసుకోవడానికి వచ్చేవారంటూ తాను జైల్లో వున్న రోజులను గుర్తు చేసుకున్నారు. "జైల్లో వుండగా కూడా ప్రజల సంక్షేమం గురించే మంత్రులను అడిగేవాడిని, ఎక్కడ తప్పు జరిగింది, ఎందుకు నేను అరెస్టయ్యాను అని జైల్లో వున్నప్పుడు తెగ ఆలోచించేవాడిని. ప్రజలకు మంచి పాఠశాలలు, ఆస్పత్రులు కట్టడమే నా తప్పు. ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు కల్పించా, కానీ జైల్లో 15రోజుల పాటు బిజెపి నాకు ఇన్సులిన్ ఆపేసింది. ఢిల్లీ ప్రభుత్వాన్ని స్తంభింపజేయాలని వారనుకున్నారు." అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తీహార్ జైల్లో వున్న మాజీ మంత్రులు మనీష్ శిసోడియా, సత్యేందర్‌జైన్‌లను గుర్తు చేసుకుంటూ, పాఠశాలలు, ఆస్పత్రుల తీరు మార్చింది వారేనన్నారు. ఢిల్లీ స్కూళ్ళ తీరును సిసోడియా మార్చారు, ఆయన్ని కేంద్ర విద్యా శాఖ మంత్రిగా చేయాలన్నారు. నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ప్రచారం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పాలస్తీనాకు పూర్తిస్థాయి సభ్యత్వం

మొదటిపేజి తరువాయి

ఓటు చేశాయి. మరో 25 దేశాలు ఓటింగ్‌కు గైర్హాజరయ్యాయి. 22 అరబ్ దేశాల తరపున యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఈ తీర్మానాన్ని ప్రతిపాదించింది. వ్యతిరేకించిన దేశాల్లో అమెరికా, ఇజ్రాయిల్,అర్జెంటీనా, జెకియా, మైక్రోనేసియా, నవురూ, పౌలూ, పపువా న్యూగినియా వున్నాయి. . ఐక్యరాజ్య సమితి నిబంధనావళిలోని 4వ అధికరణకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితి సభ్యత్వానికి పాలస్తీనా అర్హురాలని, వెంటనే సభ్యత్వాన్ని ఆమోదించాలని తీర్మానం కోరింది. ఈ తీర్మానం ఆమోదం పొందడం పట్ల సిరియా, వెనిజులా, సౌదీ అరేబియా తదితర దేశాలు హర్షం వ్యక్తం చేశాయి. ఐరాసలో పాలస్తీనాను పూర్తి సభ్యత్వ దేశంగా గుర్తించాలనేది ప్రపంచ ప్రజల డిమాండ్ అని వెనిజులా విదేశాంగ మంత్రి యెవాన్ గిల్ పేర్కొన్నారు. సౌదీ అరేబియా శాశ్వత ప్రతినిధి అబ్దుల్ అజీజ్ అల్వాసిల్ కూడా ఇదే విధమైన వ్యాఖ్య చేశారు. పాలస్తీనియన్ల ఇబ్బందులను ఇక ఎన్నాళ్లో ప్రపంచం విస్మరించలేదని, వాస్తవాన్ని గట్టిగా చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. గాజాలో పరిస్థితులు క్షీణిస్తున్న నేపథ్యంలో గతేడాది డిసెంబరు 12న జరిగిన అత్యవసర ప్రత్యేక సమావేశానికి కొనసాగింపుగా యుఎన్‌జిఎ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ జవాబుదారీతనం వహించాల్సిన రోజు ఒకనాడు వస్తుందని పాకిస్తాన్ రాయబారి మునీర్ అక్రమ్ పేర్కొన్నారు. ఓటింగ్‌కు ముందు ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా శాశ్వత పరిశీలకుడు రియాద్ మన్సూర్ మాట్లాడుతూ, పాలస్తీనియన్లకు, వారి కుటుంబాలకు, కమ్యూనిటీలకు, మొత్తంగా దేశానికి జరిగిన నష్టం, కలిగిన బాధను చెప్పడానికి మాటలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

ముగిసిన నాలుగో దశ ప్రచారం

- 10 రాష్ట్రాల్లో 96 స్థానాలకు పోలింగ్
- బరిలో 1,717 మంది అభ్యర్థులు
- ఆంధ్రప్రదేశ్, ఒడిషాలో అసెంబ్లీకీ పోలింగ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో నాలుగో దశ పోలింగ్ రేపు (సోమవారం) జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 6 గంటలతో ముగిసింది. ఈ దశలో మొత్తం 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 96 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17), ఉత్తరప్రదేశ్ (13), మహారాష్ట్ర (11), మధ్యప్రదేశ్ (8), పశ్చిమ బెంగాల్ (8), బీహార్ (5), జార్ఖండ్ (4), ఒరిస్సా (4), జమ్మూకాశ్మీర్ (1) లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. అలాగే ఆంధ్రప్రదేశ్, ఒడిషాలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 175 అసెంబ్లీ స్థానాలకు 2,368 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఒడిషాలో 147 అసెంబ్లీ స్థానాలుండగా, నాలుగో దశలో 28 స్థానాలకు పోలింగ్ జరగనుంది. మిగిలిన 119 స్థానాలకు వచ్చే మూడు దశల్లో పోలింగ్ జరుగనుంది.

96 లోక్‌సభ స్థానాలకు 1,717 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 25 పార్లమెంట్ స్థానాలకు గాను 454 మంది పోటీలో నిలిచారు. అలాగే, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గాను 525 మంది పోటీలో ఉన్నారు. బీహార్‌లో ఐదు పార్లమెంట్ స్థానాలకు 55 మంది, జమ్మూ కాశ్మీర్‌లో ఒక్క పార్లమెంట్ స్థానానికి 24 మంది, జార్ఖండ్‌లో నాలుగు పార్లమెంట్ స్థానాలకు 45 మంది, మధ్యప్రదేశ్‌లో ఎనిమిది స్థానాలకు 74 మంది, మహారాష్ట్రలో 11 పార్లమెంట్ స్థానాలకు 209 మంది, ఒరిస్సాలో నాలుగు పార్లమెంట్ స్థానాలకు 37 మంది, ఉత్తరప్రదేశ్‌లో 13 స్థానాలకు 130 మంది, పశ్చిమ బెంగాల్లో ఎనిమిది పార్లమెంట్ స్థానాలకు 75 మంది పోటీ చేస్తున్నారు. అఖిలేష్ యాదవ్ (ఎస్పీ), గిరిరాజ్ సింగ్ (బిజెపి), అర్జున్ ముండా (బిజెపి), మహువా మొయిత్రా (తృణమూల్), యూసఫ్ పఠాన్ (తృణమూల్), శత్రుఘ్న సిన్హా (తృణమూల్), అధిర్ రంజాన్ చౌదరి (కాంగ్రెస్), అసదుద్దీన్ ఓవైసి (ఎంఐఎం), వైఎస్ షర్మిలా (కాంగ్రెస్) వంటి ముఖ్యులు పోటీ చేస్తున్నారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.

ఆఫ్ఘన్‌లో ఆకస్మిక వరదలు

- 330 మందికి పైగా మృతి

కాబూల్ : ఆఫ్ఘనిస్తాన్‌లోని పలు ప్రావిన్స్‌ల్లో భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ నెల 9వ తేదీ నుంచి భారీ వర్షాలు కురియడంతో నివాస ప్రాంతాలన్నీ చెరువులను తలపించాయి. వరద నీటిలో చిక్కుకొని ప్రజలు విలవిల్లాడారు. వర్షాల కారణంగా చోటుచేసుకున్న వివిధ ప్రమాదాల్లో 330 మందికి పైగా మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. ఈ విషయాన్ని ప్రపంచ ఆహార కార్యక్రమం ఆఫ్ఘనిస్తాన్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఉత్తర బాగ్లాన్ ప్రావిన్స్‌లో ఈ వరదలకు బాగా దెబ్బతిందని, వెయ్యికి పైగా ఇళ్ళు ధ్వంసమయ్యాయని, ఇక్కడే 300 మందికి పైగా మరణించారని ఐక్యరాజ్య సమితి సంస్థ శనివారం సోషల్ మీడియాలో తెలిపింది. వరద బాధితులకు ప్రస్తుతం ఆహారం అందిస్తున్నట్లు పేర్కొంది. గత నెల రోజులుగా ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో నదులు, చెరువులు పొంగి వరదలు రావడంతో పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించిందని స్థానిక అధికారులు తెలిపారు.

షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్‌లో సోదాలు

కడప ప్రతినిధి: కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ కంపెనీలో సోదాల అంశం కలకలం రేపింది. శనివారం మధ్యాహ్నం షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ యూనిట్-2 విభాగంలో ఐటి, స్టేట్ ట్యాక్స్, ఎన్నికల అబ్జర్వర్లు ఏడు బృందాలుగా ఏర్పడి పోలీసుల సహాయంతో రెండు గంటల పాటు తనిఖీలు చేశారు. ఎటువంటి ఆధారాలను సేకరించాయనే వివరాలను తనిఖీ బృందాలు వెల్లడించలేదు.



కనువిప్పు



గుత్తి గ్రామ శివారున పిచ్చయ్య, పిచ్చమ్మ దంపతులకు తిరకాసు అనే కొడుకు ఉండేవాడు. తిరకాసుకి చిన్నప్పటి నుంచి మొక్కలు పీకడమంటే మహా సరదా. కనిపించిన ప్రతి మొక్కనీ పీకేవాడు.

'మొక్క లేకుంటే మనకి బతుకు లేదురా, వాటికి కాసిన్ని నీళ్ళు పోసి పెంచరా' అని తల్లి ఎంత చెప్పినా తిరకాసు చెవికెక్కేది కాదు. కొన్నాళ్ళకి తిరకాసు పెరిగి పెద్దవాడయ్యాడు. చదువు సంధ్య అబ్బలేదు. కాలం గడిచింది. తల్లి తండ్రి ముసలి వాళ్లు అయ్యారు. వాళ్ల పోషణ బాధ్యత తిరకాసు మీద పడింది. చిన్నప్పటి నుంచి మొక్కలు పీకివేయడం వల్ల ఇంటి చుట్టుపక్కల పరిసరాల్లో చెట్టు అనేది లేకుండా పోయింది. వంట చెరకు, కూరగాయలు, పళ్ళు అన్నిటికీ కొరత ఏర్పడింది. అలసిన తర్వాత కాసేపు సేద దీరుదామంటే చెట్టు నీడలేదు. తిరకాసుకు వయసు మీద పడింది, శక్తి సన్నగిల్లింది. వంట చెరకు కోసం దూరంగా వెళ్ల లేక ఆహారం లేక ఇబ్బంది పడేవాడు. తల్లితండ్రిని పస్తులుంచలేక వంట చెరకు కోసం దూరంగా ఉన్న అడవికి వెళ్ళాలి అనుకున్నాడు. మర్నాడు ఉదయాన్నే లేచి అడవికి బయలుదేరాడు. చాలాసేపు నడిచాడు. ఎండ విపరీతంగా కాస్తోంది. నోరు తడి ఆరిపోయింది. కొంత సేపటికి ఒక పెద్ద చెట్టు కనిపించింది. ఆ చెట్టు నీడన కూర్చుని కాసేపు సేద దీరాడు. ఎంతో హాయిగా అనిపించింది. ఆ చెట్టుపై ఎన్నో పక్షులు గూడు కట్టుకుని ఉన్నాయి. చెట్టు కింద ఎండు కలప, పండ్లు రాలి ఉన్నాయి. వాటన్నింటినీ చూసిన తిరకాసుకు తాను చేసిన తప్పేంటో తెలిసివచ్చింది. చెట్లు పెంచకపోవడం వల్లే తను ఇంతదూరం రావాల్సి వచ్చిందని గ్రహించాడు. ఇకనుంచైనా చెట్లను పెంచాలని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. చెట్టుని పట్టుకుని 'నన్ను క్షమించు. ఇంకెప్పుడూ నిన్ను చంపను' అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఎప్పుడూ ఏడ్వని కొడుకు నిద్రలో అలా ఏడుస్తుంటే పక్కనే ఉన్న పిచ్చమ్మ తెగ కంగారుపడిపోయింది. 'ఏమైందిరా? లే..' అని తట్టి లేపింది.

నిద్రలేచిన తిరకాసు కొంచెం సేపు అయోమయంగా ఉండిపోయాడు. పరుగున పెరట్లోకి వెళ్ళాడు. తల్లి చెప్పినా వినకుండా పీకిన మొక్కలను తలచుకొని బాధ పడ్డాడు. పరుగున ఇంట్లోకి వచ్చి కల మొత్తం అమ్మకి చెప్పాడు. 'అది కలే. అయినా అదే వాస్తవం. ఆస్తులు పెరగక పోయినా పరవాలేదు. ఆక్సిజన్ పెరగాలి. లేకుంటే మనకి మనుగడలేదు. గాలి, నీరు, నీడ, ఆహారం అన్నిటికీ మొక్కే ఆధారం. అలాంటి మొక్కలను పెరగనివ్వాలి' అని పిచ్చమ్మ చెప్పింది.

'అమ్మా ఇక మీదట నువ్వు చెప్పినట్లే వింటాను. మొక్కలు పీకను. వాటికి నీళ్ళు పోసి పెంచుతాను' అని అమ్మకి మాటిచ్చాడు తిరకాసు. కొడుకు మాటలు విని పిచ్చమ్మ మురిసిపోయింది. 'నువ్వు తిరకాసువి కాదు బంగారు కాసువి' అని ముద్దాడింది.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

ఫ్యాషన్





హాయ్ ఫ్రెండ్స్, నా పేరు పూర్ణ దీపిక. మా ఊరు పేరు రంగాపురం. నేను ఎల్‌కేజీ చదువుతున్నాను. బాగా అల్లరి చేస్తానని అమ్మ అంటుంది. అమ్మకి నేనంటే చాలా ఇష్టం. నా పుట్టినరోజుని అమ్మానాన్న భలే సరదాగా చేస్తారు. ఈ ఫొటోలు అప్పుడు తీసినవే. ఫోజులు బాగా ఇచ్చానా?

- ఉదయగిరి పూర్ణ దీపిక,
ఎల్‌కేజీ, గీతాంజలి హైస్కూలు,
రెడ్డిగూడెం మండలం,

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా ప్రతిరోజూ 'వేసవి విడిది' ముస్తాబై వస్తోంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లు మెయిల్‌కి లేదా

వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.
మెయిల్ ఐడీ : chinnaarips@gmail.com

- ఎడిటర్

బొమ్మరిల్లు





ఎం.కిరణ్ కుమార్,
7వ తరగతి,
జిహెచ్ఎస్,
బంగారుపాలెం,
99660 16132.

JEEVANA జీవన the family



కొడుకుగా సాకి .. కూతురుగానూ ఆదరించి...

ఆడబిడ్డైనా, మగబిడ్డైనా, చూడలేకపోయినా, మాట్లాడలేకపోయినా, ఆ బిడ్డ పట్ల అమ్మ ప్రేమలో ఏ లోపమూ ఉండదు. బిడ్డల రంగును బట్టి, గుణాన్ని బట్టి అమ్మ తన ప్రేమను తగ్గించుకోదు. బిడ్డ ఉన్నతికై అహర్నిశలు పాటు పడుతుంది. ఏ చిన్న కష్టమొచ్చినా తల్లడిల్లిపోతుంది. అయితే ఆ బిడ్డే తన అస్తిత్వం కోసం పోరాడుతుంటే మాత్రం చాలా సందర్భాల్లో ఆ కన్న హృదయం కఠినమైపోతుంది. బిడ్డకు ఇంత కష్టమొచ్చిందని, దు:ఖపడుతుందేకానీ, ఆ బిడ్డకు అండగా ఉండాలని మాత్రం అనుకోదు. అయితే అలాంటి అమ్మలందరూ ఒక్కసారి ఈ అమ్మ గురించి తెలుసుకోవాలి. బిడ్డకు జన్మనివ్వడంతోనే బాధ్యత తీరిపోదని, ఆ బిడ్డను తనను తానుగా గుర్తించి ప్రేమించి, ఆదరించాలని, కొండంత ధైర్యమివ్వాలని, నిలువెత్తు అండగా నిలవాలని చాటిచెబుతున్నారు హైద్రాబాద్‌కి చెందిన ముకుంద మాల.

భార్యాభర్త, గారాల కొడుకుతో చీకూచింతా లేని కుటుంబం ఆమెది. అల్లారుముద్దుగా పెరుగుతున్న కొడుకు చదువులో రాణిస్తుంటే ఎంతో మురిసిపోయింది. మెడిసిన్ చదువుతున్న కొడుకుపైనే అన్ని ఆశలు పెట్టుకుని బతికింది. పెళ్లి చేసి, ఓ ఇంటివాడిని చేయాలని కలలు కన్నది. విశ్రాంత జీవనమంతా మనవళ్లు, మనవరాళ్లతో హాయిగా ఆడుకోవాలని ఆశపడ్డది. కానీ ఆమె కోరికలన్నీ తలకిందులయ్యే రోజు ఒకటి వచ్చింది. 'ఎవరైనా అమ్మాయిని ఇష్టపడితే చెప్పు. ఏ అభ్యంతరం లేకుండా పెళ్లి చేస్తామ'ని కొడుకుతో చెప్పినప్పుడు పిడుగు లాంటి వార్త ఒకటి విన్నది.

'అమ్మా నేను ఏ అమ్మాయినీ పెళ్లి చేసుకోను. నాకు ఆ ఉద్దేశం లేదు. నేను 'గే'ని' అని నా కొడుకు చెప్పినప్పుడు అసలు వాడు ఏం చెబుతున్నాడో నాకు అర్థం కాలేదు. నేను ఆ పదం వినడం అదే మొదటిసారి. దానర్థం తెలిసినప్పుడు కాళ్ల కింద భూమి కదిలినట్లు అనిపించింది. కానీ వెంటనే తేరుకున్నాను. 'నువ్వు ఎవరైనా నాకనవసరం. నువ్వు నా బిడ్డవి' అని వాడికి ధైర్యం చెప్పాను. కానీ తల్లి మనసు కదా! నా తృప్తి కోసం పిల్లవాడ్ని తీసుకుని వైద్యులను కలిశాను. వాళ్లు నాకే కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.

ట్రాన్స్‌జెండర్, గే, లెస్బియన్, బైసెక్సువల్ వంటివి నేనెప్పుడూ వినని పదాలు. తెలియని అంశాలు. నా కొడుకు గురించి తెలిసిన తరువాతే వాళ్ల గురించి అధ్యయనం చేశాను. 'ఇప్పటి వరకు నా బిడ్డను అందరు తల్లుల్లాగే ప్రేమించాను. ప్రోత్సహించాను. కానీ ఇప్పుడు నా బిడ్డ సమాజం నుంచి తీవ్ర వివక్షను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాడు. తన అస్తిత్వం కోసం పోరాడుతున్నాడు. ఈ సమయంలోనే అమ్మలా నా బాధ్యత మరింత పెరగాలి. ఈ విషయం నా భర్తతో చెప్పినప్పుడు తను కూడా ఎంతో హుందాగా వ్యవహరించారు. 'వాడిని ఏమీ అనకు. నువ్వేమీ దిగులు పడకు. ఇప్పుడే మనం వాడికి అండగా నిలబడాలి' అని చెప్పారు.

తను 'గే' అని చెప్పే సమయానికి వాడు ఎంబిబిఎస్ చదువుతున్నాడు. చదువులో మొదటి నుంచి ఎంతో చురుకుగా ఉండేవాడు. వాడి ప్రతిభకు ఉన్నత విద్యలో ఫ్రీ సీట్లు వచ్చాయి. గొప్ప తెలివితేటలతో రాణిస్తున్న కొడుకుని లైంగికతను బట్టి ఎలా దూరం చేసుకోగలను? వాడి కెరియర్ ఏమైపోతుంది? అందుకే వాడికి అండగా నిలబడ్డాను' అంటున్న ముకుంద లాంటి తల్లులు మనకు చాలా అరుదుగా కనిపిస్తారు.

'ఇక్కడైతే సమాజం నుంచి చాలా వివక్ష ఎదుర్కొంటాడని చాలా జాగ్రత్తగా ఉండమన్నాను. చదువు పూర్తయ్యేవరకు బయట పడకని నచ్చచెప్పాను. వైద్య విద్య పూర్తి చేశాక విదేశాలకు వెళ్లమని ప్రోత్సహించాను. వాడూ అలాగే కష్టపడ్డాడు. యూరప్ యూనివర్శిటీలో మాస్టర్స్‌కి ఫ్రీ సీటు సాధించాడు. అక్కడే ఎంఎస్ జెరంటాలజీ పూర్తి చేశాడు. నిమ్స్‌లో జీరియాట్రిక్ మెడిసిన్‌పై పీజీ డిప్లమా చదివాడు. ఆ తరువాత జెరంటాలజీలో ఎల్జీబీటిక్యూ వ్యక్తుల ఏజింగ్ మీద పిహెచ్‌డీ చేశాడు. అది సాధించడం కోసం ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపాడు. పట్టా సాధించే చివరి మెట్టులో వాడి అస్తిత్వం అక్కడివారికి తెలిసిపోయింది. అంతే వాడి పిహెచ్‌డీ అర్థంతరంగా ఆగిపోయింది. ఆ రోజు నా బిడ్డ ఏడ్చుకుంటూ ఫోన్ చేశాడు. ఆ క్షణం నా తల్లి హృదయం ఎంత తల్లడిల్లిపోయిందో మాటల్లో చెప్పలేను. నా కళ్ల ముందే ఉంటే ఎలాగోలా ఓదార్చుకోగలను. కానీ ఎక్కడో దూరతీరాన.. వాడు ఏమై పోతాడోనని తెగ కంగారు పడిపోయాను. ఆ రోజు నాకు ఒక్కటే అర్థమైంది.. ఈ ప్రపంచంలో ఎక్కడైనా, ఎంత ఉన్నత చదువు చదివినా, విజయ శిఖరాలు అందుకున్నా, నా బిడ్డలాంటి వ్యక్తులు వివక్షకు గురవుతారని' అంటూ ముకుంద ఎంతో భావోద్వేగంతో చెప్పారు.

> ముకుంద కొడుకు ఇప్పుడు పూర్తిగా అమ్మాయిగా మారిపోయారు. పిహెచ్‌డీ పూర్తి చేసి, పోస్ట్ డాక్టోరోల్ సాధించారు. ఎక్కడైతే అవమానం జరిగిందో, అక్కడే బెస్ట్ పెర్ఫార్మర్‌గా గుర్తింపు పొందారు. కాదన్న వారి నుండే సాదర స్వాగతాలు అందుకుంటున్నారు. బిడ్డ ఉజ్వల భవిష్యత్తుకై కలలు గనే ఒక తల్లికి ఇంతకంటే ఏం కావాలి?

'ఆ రోజు నా బిడ్డ ఒక మాట అన్నాడు. 'అమ్మా, నేనేమీ చేసుకోను. నువ్వు కంగారు పడకు. నువ్విచ్చిన ధైర్యంతో ఏ కష్టమొచ్చినా అధిగమిస్తాను. కానీ, నాలాంటి వాళ్లు ఈ లోకంలో ఎంతోమంది. అమ్మానాన్నలు ఆదరించక, కుటుంబాల నుంచి విడిపోయి దుర్భరంగా జీవిస్తున్నారు. నువ్వు వాళ్ల కోసం నిలబడు. వారి హక్కుల కోసం పోరాడు' అని చెప్పాడు' అంటూ తన కొడుకు ఔదార్యం గురించి ముకుంద ఎంతో గర్వంగా చెప్పారు.

ఉద్యోగం చేస్తున్న సమయం నుండే ముకుంద, తన కొడుకుతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. మొదట హెచ్ఐవీ బాధితులు, అనాధ, వృద్ధాశ్రమాల్లో సేవా ప్రస్థానం ప్రారంభించిన ఆమె 2012లో తొలిసారి కొడుకుతో కలిసి ఎల్జీబీటీ వ్యక్తులకు మద్దతుగా 'ప్రైడ్ మార్చ్'లో పాల్గొన్నారు. ఆ రోజు నుండి నేటి వరకు ఆమె సేవాప్రస్థానం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. 'క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్' ప్రారంభించి ఎల్జీబీటీ వ్యక్తుల హక్కుల కోసం, వారి అస్తిత్వం కోసం శక్తివంచన లేకుండా పోరాడుతున్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రోత్సాహంతో ఎల్జీబీటీ వ్యక్తులకు రావాల్సిన న్యాయమైన హక్కులను సాధిస్తున్నారు. ముకుంద చేసిన సాయంతో ఎంతోమంది ట్రాన్స్ వ్యక్తులు ప్రముఖ సంస్థల్లో ఉన్నత కొలువులు సాధించారు. సమాజంలో గౌరవంగా జీవిస్తున్నారు. పలు సెమినార్లు, ప్రచార కార్యక్రమాల్లో ఎల్జీబిటీల తరపున తన గళాన్ని వినిపిస్తున్నారు. కుటుంబాల్లో చైతన్యం నింపుతున్నారు. 65 ఏళ్ల వయసులో కూడా రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న ముకుంద ఇప్పుడు తన బిడ్డకే కాదు, ఎంతోమందికి అమ్మ.

కుటుంబం నుంచి గెంటివేయబడి, అసాంఘిక కార్యకలాపాలు చేయించే ముఠాలకు ఇరుక్కుపోయిన ఎందరో బాధితులకు ముకుంద అండగా నిలబడుతున్నారు. గుర్తింపు కార్డులు ఇప్పిస్తున్నారు. దాతల నుండి నిధులు సేకరించి ఆర్థికంగా సాయం చేస్తున్నారు. 'సాయం కోసం ఏ చిన్న సందేశం ఇచ్చినా, అర్ధరాత్రి అయినా స్పందిస్తాను. ఏ ఆపదలో ఉండి ఫోను చేశారో.. నేను మాట్లాడకపోతే వాళ్ల జీవితం ఏమై పోతుందో అని భయపడిపోతాను. అందుకే ఓపిక ఉన్నా లేకపోయినా వాళ్లతో మాట్లాడాకే నిద్రపోతాను' అంటున్న ఆమె గొప్ప మాతృహృదయానికి నిదర్శనం.

- జ్యోతిర్మయి

ఎదురుకాల్పులు కాదు.. వేటాడి చంపుతున్నారు

- దండకారణ్యంలో భద్రతా దళాల దాష్టీకాలు
- పౌర సంఘాల నేతల ఆందోళన



కంకేర్‌లో ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను తరలిస్తున్న జవాన్లు (ఫైల్)

ఛత్తీస్‌గఢ్/హైదరాబాద్ : దండకారణ్యం ఇటీవల కాలంలో నిత్యం రక్తమోడుతూనేవుంది. బీజాపూర్‌లో పిడియా గ్రామంలో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయి స్టులు చనిపోతే.. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ఇది భద్రతాబలగాలు సాధించిన గొప్ప విజయంగా పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వంద మందికి పైగా మావోయిస్టులు ఎదురుకాల్పుల్లో చనిపోయారు. ఇవి ఎదురుకాల్పులు కానేకాదని, భద్రతాబలగాలు వెంటాడి వేటాడి చేస్తున్న హత్యలు అని పలు పౌర సంఘాలు, మావన హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

పక్కా ప్రణాళికతో ఏరివేత

దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత భద్రత బలగాల పక్కా ప్రణాళికతోనే సాగుతోంది. ఏ చిన్నపాటి సమాచారం అందినా భారీ స్థాయిలో బలగాలను రంగంలోకి దింపి మావోయిస్టులను చంపేస్తున్నారు. బీజాపూర్ జిల్లాలో పిడియా సమీపంలోని అడవిలో మావోయిస్టు కీలక నాయకులు సహా దాదాపు 150 మంది కేడర్ మకాం వేసినట్లు భద్రతా దళాలకు సమాచారం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు కోబ్రా, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లోని డిఆర్‌జి దళాలను అప్రమత్తం చేసి అందరినీ రప్పించారు. దాదాపు వెయ్యి మంది జవాన్లు పిడియా సమీపంలో అడవిలోకి చేరుకొన్నారు. మావోయిస్టులు కనిపించగానే కాల్పుల మోత మోగించారు. అయితే మావోయిస్టులే మొదట కాల్పులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దాదాపు 11 గంటలపాటు అడవిలో వేర్వేరుచోట్ల భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పులు చోటుచేసుకున్న ప్రాంతంలోనే బస్తర్ డివిజన్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావ్, దర్భా డివిజన్ ఎస్‌జిసి చిట్టీ, పిఎల్‌జిఎ కంపెనీ నెంబర్-2 కమాండర్‌ల్లా , గంగలూరు ఏరియా కమిటీ ప్లాటూన్‌కు చెందిన దినేష్ మోడియం వంటి మావోయిస్టు దళ నాయకులు మకాం వేసివుంటారని తెలిసింది. ఈ ఎన్‌కౌంటర్లో చనిపోయిన 12 మందిలో నాయకత్వ స్థాయి మావోయిస్టులు ఎవ్వరూ లేరని అధికారులు ప్రకటించారు.

ఎన్నికల వేళ.. కాల్పుల మోత

సార్వత్రిక ఎన్నికల వేళ భద్రతా బలగాలు మరింత విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ఇటీవల ఏప్రిల్ 3న జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 29 మంది మావోయిస్టులను చంపేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇదే అతిపెద్ద ఎన్‌కౌంటర్. ఆ తర్వాత నారాయణ్‌పుర్ వద్ద 10 మందిని, తాజాగా పడియా వద్ద మరో 12 మందిని ఎన్‌కౌంటర్ చేశారు.

మావోయిస్టు కోటపై దృష్టి

ఛత్తీస్‌గడ్‌లోని 27 జిల్లాల్లో 18 చోట్ల మావోయిస్టులకు పట్టుంది. దంతెవాడ, బీజాపూర్, నారాయణ్‌పుర్, బస్తర్, కాంకేర్ వంటి ప్రాంతాలు వారికి బలమైనవి. 2010లో 76 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల హత్య, 2013లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అగ్రనాయకులను చంపడంతో ఛత్తీస్‌గడ్ వణికిపోయింది. దీంతో, కేంద్రం నేరుగా భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. ఆంధ్రాకు చెందిన గ్రేహౌండ్స్ నమూనాలో కోబ్రా దళాలను సిద్ధం చేశాయి. మావోయిస్టుల సమాచారం ఇస్తే భారీగా నగదు ప్రోత్సాహకాలు, ఉద్యోగాలు ఇస్తామంటూ స్థానిక ప్రజానీకానికి భద్రతాబలగాలు ఎర వేశాయి. స్థానిక యువతీ యువకులతో ఏర్పాటుచేసిన 'బస్తరియా బెటాలియన్' మావోయిస్టులను ఏరివేయడంలో ఉపయోగపడుతున్నాయని, మహిళా మావోయిస్టులతో పోరాటానికి మహిళా దళాలకు కూడా శిక్షణ ఇచ్చారు.

దండకారణ్యంలో దళాల పాగా

ఛత్తీస్‌గడ్‌లోని దండకారణ్యాన్ని చీల్చుకొంటూ సుక్మా, బీజాపూర్, జగదల్‌పూర్‌లో 11 ముఖ్యమైన రోడ్డు ప్రాజెక్టులను పూర్తి చేయడంతో మావోయిస్టుల ఆనుపానులు సులువుగా తెలుస్తున్నాయి. పల్లి-బార్సుర్ రహదారి పూర్తికావడంతో భద్రతా దళాలు బోద్లి, ఖేడామెటా ప్రాంతాలకు చేరుకొనేందుకు సులువైన మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ లోపే సుక్మా-బీజాపూర్ ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్ 20 క్యాంపులను ఏర్పాటుచేసింది. కాంకేర్‌లో బిఎస్ఎఫ్ మూడు క్యాంపులు ఏర్పాటుచేసింది. మావోయిస్టుల నాయకుడు హిడ్మాకు పట్టున్న ప్రాంతంగా పేరున్న పువర్తి గ్రామంలోనే ఏకంగా పోలీస్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఇవి ఇప్పుడు అబూర్ఖుమాడ్ అడవులకు కూడా విస్తరించాయి. ఎన్నికలు రావడం, సాధారణంగా ఎండాకాలంలో అడవుల్లో కూంబింగ్‌కు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో భద్రతా దళాలు అడవుల్లోకి చొచ్చుకెళ్లి మావోయిస్టులను వేటాడుతున్నాయి. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన సమస్యను మనుషులను చంపేయడం ద్వారా సాధించాలని భావించడం పెద్ద తప్పిదమని పౌర హక్కుల నేతలు ఆవేదన చెందుతున్నారు.

ప్లే-ఆఫ్స్‌కు కోల్‌కతా

- ముంబయిపై 18పరుగుల తేడాతో గెలుపు



కోల్‌కతా: ప్లే ఆఫ్స్ బెర్తును ఖాయం చేసుకోవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో కోల్‌కతా విజయం సాధించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా జట్టు 18పరుగుల తేడాతో గెలిచింది. వర్షం కారణంగా ఓవర్లు కుదించిన ఈ మ్యాచ్ తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 16 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 157పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబయి ఓపెనర్లు దాటిగా ఆడినా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ నిరాశపరిచారు. దీంతో 16ఓవర్లు పూర్తయ్యే సరికి ముంబయి జట్టు 8వికెట్లు కోల్పోయి 139పరుగులే చేసింది. ఈ గెలుపుతో కోల్‌కతా 18పాయింట్లతో ప్లే-ఆఫ్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో కోల్‌కతా కష్టాలతోనే ఇన్నింగ్స్ ప్రారంభించింది. తొలి ఓవర్లోనే ఫిలిప్ సాల్ట్(6)ను తుషార వెనక్కి పంపాడు. మరో ఓపెనర్ సునీల్ నరైన్(0)ను బుమ్రా బౌల్డ్ చేశాడు. దీంతో కోల్‌కతా 10 పరుగులకే ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన వెంకటేశ్ అయ్యర్(42) కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(7)తో కీలక పరుగులు చేశాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 30పరుగులు జోడించారు. ఆ తర్వాత నితీశ్ రానా(33), ఆండ్రూ రస్సెల్(24) వేగంగా ఆడి ఐదో వికెట్‌కు 39పరుగులు రాబట్టారు. ఆఖర్లో రింకూ సింగ్(20) మెరుపులు మెరిపించాడు. ముంబయి బౌలర్లలో జస్ప్రీత్ బుమ్రా, పీయూష్ చావ్లాకు రెండేసి, తుషారా, కంబోజ్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో ముంబయి ఓపెనర్లు ఇషాన్ కిషన్(40), రోహిత్ శర్మ(19) తొలి వికెట్‌కు 6.5ఓవర్లలో 65పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(11) నిరాశపరిచినా.. తిలక్ వర్మ(32) రాణించాడు. ఆ తర్వాత లోయర్ ఆర్డర్ బ్యాటర్లంతా ఇలా వచ్చి అలా వెళ్లారు. దీంతో ముంబయి జట్టు ఛేదనలో వెనుకబడి ఓటమిపాలైంది. కోల్‌కతా బౌలర్లు హర్షిత్ రాణా, చక్రవర్తి, రస్సెల్‌కు రెండేసి, నరైన్‌కు ఒక వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా ఇన్నింగ్స్: సాల్ట్ (సి)కంబోజ్ (బి)తుషారా 6, నరైన్ (బి)బుమ్రా 0, వెంకటేశ్ అయ్యర్ (సి)సూర్యకుమార్ (బి)చావ్లా 42, శ్రేయస్ అయ్యర్ (బి)కంబోజ్ 7, నితీశ్ రాణా (రనౌట్) తిలక్ వర్మ 33, రస్సెల్ (సి)కంబోజ్ (బి)చావ్లా 24, రింకు సింగ్ (సి)ఇషాన్ కిషన్ (బి)బుమ్రా 20, రమన్‌దీప్ సింగ్ (నాటౌట్) 17, స్టార్క్ (నాటౌట్) 2, అదనం 6. (16ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 157పరుగులు. **బౌలింగ్:** తుషారా 3-0-31-1, బుమ్రా 4-0-39-2, కంబోజ్ 3-0-24-1, హార్దిక్ 3-0-32-0, చావ్లా 3-0-26-2.

ముంబయి ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి)రింకు సింగ్ (బి)నరైన్ 40, రోహిత్ శర్మ (సి)నరైన్ (బి)చక్రవర్తి 19, సూర్యకుమార్ (సి)రమన్‌దీప్ సింగ్ (బి)రస్సెల్ 11, తిలక్ వర్మ (సి)సాల్ట్ (బి)హర్షిత్ రాణా 32, హార్దిక్ పాండ్యా (సి)వైభవ్ అరోరా (బి)వరణ్ చక్రవర్తి 2, టిమ్ డేవిడ్ (సి)శ్రేయస్ అయ్యర్ (బి)రస్సెల్ 0, వధేరా (రనౌట్)స్టార్క్/సాల్ట్ 3, నమన్ ధీర్ (సి)రింకు సింగ్ (బి)హర్షిత్ రాణా 17, కంబోజ్ (నాటౌట్) 2, చావ్లా (నాటౌట్) 1, అదనం 12. **బౌలింగ్:** వైభవ్ అరోరా 2-0-16-0, స్టార్క్ 1-0-11-0, హర్షిత్ 3-0-34-2, నరైన్ 3-0-21-1, వరణ్ చక్రవర్తి 4-0-17-2, రస్సెల్ 3-0-34-2,

ఐపిఎల్‌లో నేడు

చెన్నై × రాజస్తాన్
వేదిక: చెన్నై; మ.3.30గం॥లకు
బెంగళూరు × ఢిల్లీ
వేదిక: బెంగళూరు; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
కోల్‌కతా	12	9	3	18	1.42
రాజస్తాన్	11	8	3	16	0.47
సన్‌రైజర్స్	12	7	5	14	0.40
చెన్నై	12	6	6	12	0.49
ఢిల్లీ క్యాపిటల్స్	12	6	6	12	-0.31
లక్నో	12	6	6	12	-0.76
బెంగళూరు	12	5	7	10	0.21
గుజరాత్	12	5	7	10	-1.32
ముంబయి	13	4	9	8	-0.27
పంజాబ్‌కింగ్స్	12	4	8	8	-0.42

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

బాపట్ల ఎంపి సురేష్‌పై దాడి

- యద్దనపూడి స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి-యద్దనపూడి (బాపట్ల జిల్లా)

బాపట్ల వైసిపి ఎంపి నందిగం సురేష్‌పై టిడిపి కార్యకర్తలు దాడి చేశారు. యద్దనపూడి మండలం చింతపల్లిపాడు వద్ద శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీనిపై యద్దనపూడి పోలీసుస్టేషన్‌లో 15 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంపి నందిగం సురేష్ చీరాలలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని.. యద్దనపూడి మీదుగా మార్టూరు మండలం వలపర్లకు వెళ్తున్నారు. చింతపల్లిపాడు వద్ద ఆయన వాహనానికి టిడిపికి చెందిన ప్రచార వాహనాలతో కార్యకర్తలు ఎదురుపడ్డారు. ర్యాలీలో ఉన్న టిడిపి కార్యకర్తలు కొందరు ఆయన కారుకు ద్విచక్ర వాహనాలు అడ్డం పెట్టారు. దీనిపై ప్రశ్నించేందుకు కారు దిగిన ఎంపిపై కర్రతో దాడి చేశారు. ఆ గ్రామానికి చెందిన అట్లూరి మహేష్ ఎంపికి అడ్డుపడగా ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎంపి సురేష్ యద్దనపూడి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని, అడ్డుపడిన తన అనుచరులపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంపి ఫిర్యాదు మేరకు పోలీసులు టిడిపి కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. వైసిపి కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయాలని కొద్దిసేపు ఆందోళన చేశారు.

నకిలీ జిఎస్‌టి అధికారి అరెస్టు

- ఓ పరిశ్రమ నుంచి రూ.ఐదు లక్షల డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

ఎన్నికల నేపథ్యంలో అందరూ రాజకీయాలతో బిజీగా ఉంటే ఇదే అదునుగా భావించిన ఓ వ్యక్తి జిఎస్‌టి అధికారి అవతారమెత్తి వసూళ్ల పర్వానికి తెరలేపా డు. చిన్న పరిశ్రమల యజమానులను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో ఓ పరిశ్రమ యజమాని రామరాజు వద్దకు రెండ్రోజుల క్రితం విజయవాడకు చెందిన డి.ఆంజనేయులు వచ్చాడు. తాను సిజిఎస్‌టి అధికారినని పరిచయం చేసుకుని కంపెనీ వివరాలను అడిగి తెలుసుకున్నాడు. అనంతరం రూ.ఐదు లక్షలివ్వాలని డిమాండ్ చేశాడు. అయితే తాను పన్ను చెల్లిస్తున్నానని, అంత మొత్తం ఎందుకివ్వాలని రామరాజు ప్రశ్నించారు. ఇది మామూలేనని, ఇతర కంపెనీ వాళ్లు కూడా ఇచ్చారని పలు పేర్లను చెప్పాడు. దీనిపై సదరు కంపెనీ యజమాని సిజిఎస్‌టి అధికారులను ఆశ్రయించగా అతనెవరో తమకు తెలీదని వారు చెప్పారు. దీంతో కంపెనీ యజమాని పోలీసులను, మీడియాను ఆశ్రయించారు. డబ్బులు తీసుకునేందుకు ఎర్రబాలంలోని కంపెనీ వద్దకు ఆంజనేయులు రాగా పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నిషాకు ఒలింపిక్ బెర్త్



ఇస్తాంబుల్: మహిళా రెజ్లర్ నిషా దహియాకు ఒలింపిక్ బెర్త్ దక్కింది. ఇక్కడ జరుగుతున్న ప్రపంచ ఒలింపిక్ క్వాలిఫికేషన్ రెజ్లింగ్ పోటీల్లో నిషా దహియా సెమీస్‌కు చేరింది. శనివారం జరిగిన 68కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో నిషా రొమేనియాకు చెందిన అలెగ్జాండ్రా అంగెల్‌ను చిత్తుచేసింది. హోరాహోరీ పోరులో నిషా 8-4 పాయింట్ల తేడాతో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఈ పోటీల్లో నిషా తొలి పిరీయడ్‌లోనే 8-0పాయింట్ల ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత రెండు పాయింట్లు, మరో దఫా మరో రెండు పాయింట్లను ప్రత్యర్థికి సమర్పించుకొంది. యూరోపియన్, అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన నిషా చివర్లో ప్రత్యర్థి దాడులను సమర్థవంతంగా నిలువరించి మ్యాచ్‌ను ముగించింది. ప్రి క్వార్టర్స్‌లో బెలారస్ టీనేజర్ అలీనాపై 3-0 పాయింట్లతో నెగ్గి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. సెమీస్‌కు చేరిన రెజ్లర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు దక్క నున్నాయి. దీంతో పారిస్ ఒలింపిక్స్-2024 అర్హత సాధించిన ఐదో భారత మహిళా రెజ్లర్‌గా నిషా నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నిషా 58వ స్థానంలో ఉండగా.. సెమీస్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన 9వ ర్యాంకర్ అడెలా హాంజ్లికోవాతో తలపడనుంది. హాంజ్లీకోవా 7-4పాయింట్ల తేడాతో ఏంజెలోను చిత్తుచేసి సెమీస్‌కు చేరింది.

క్రికెట్‌కు ఆండర్సన్ గుడ్‌బై..!

వెస్టిండీస్‌తో తొలిటెస్ట్ చివరిదంటూ ప్రకటన



లార్డ్స్: ఇంగ్లండ్ సీనియర్ టెస్ట్ బౌలర్, 43ఏళ్ల జేమ్స్ ఆండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాడు. ఈ ఏడాది చివర్లో వెస్టిండీస్‌తో లార్డ్స్ వేదికగా జరిగే టెస్ట్ చివరిదంటూ ప్రకటించాడు. సోషల్ మీడియా వేదికగా ఆండర్సన్ తన రిటైర్మెంట్ ప్రకటనను వెల్లడించాడు. టెస్ట్ కెరీర్‌లో 700 వికెట్లు తీసిన తొలి పేసర్ ఆండర్సన్ మాత్రమే. రిటైర్మెంట్ తర్వాత గోల్ఫ్ ఆడతాననిఆండర్సన్ తెలిపాడు. 'తనకు మద్దతునిచ్చిన ఆటగాళ్లకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు. 2003లో 22ఏళ్ల వయసులో లార్డ్స్‌లో అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన ఆండర్సన్... అదే వేదికపై 21ఏళ్ల తర్వాత క్రికెట్‌నుంచి వైదొలగనున్నాడు. 187టెస్టుల్లో 700వికెట్లు తీసిన ఆండర్సన్ 32సార్లు 5కు పైగా వికెట్లు కూల్చాడు. 194వన్డేల్లో 269వికెట్లు పడగొట్టాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68